తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

94949 23460



ఎడిటర్ : గద్దం నాగరాజు

జాతీయ దిన పత్రిక

RNI . TELTEL / 2022 / 83463

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం....

హైదరాబాద్

సోమవారం

11 ఆగస్టు 2025

సంపుటి : 357

సంచిక : 2

పేజీలు : 8

వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa

Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna




## పాక్‌కు గట్టి ఎదురుదెబ్బ

- దాయాది దేశం పాకిస్తాన్‌కు భారత్ కారణంగా గట్టి ఎదురుదెబ్బ
- పాక్‌కు రెండునెలల్లో రూ.1240 కోట్లు లాస్.

ఇస్లామాబాద్

దాయాది దేశం పాకిస్తాన్‌కు భారత్ కారణంగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత దాయాది తీసుకున్న చర్యలు, నిర్ణయాలు వల్ల పాకిస్తాన్‌కే ఊహించని షాక్ కొట్టింది. ఈ కారణంగా కేవలం రెండు నెలల కాలంలో పాక్‌కు ఏకంగా రూ.1,240 కోట్ల నష్టం వాటిల్లినట్టు డాన్ పత్రిక ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనను ఉటంకిస్తూ నివేదించింది. ఇంతకీ ఏం జరిగిందంటే పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య చోటుచేసుకున్న దౌత్యపరమైన ఉద్రిక్తతల్లో భారత్ పలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేయడంతో పాటు భారత్‌పై కక్షగట్టిన పాక్.. తన గగనతలాన్ని మూసివేసింది. భారత విమానాలు తమ గగనతలం మీదుగా వెళ్లకుండా పాక్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ నిర్ణయంతో

-మిగతా 2 లో



# ముప్పును తప్పించండి


## హైదరాబాద్ ముంపు ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మిక పర్యటన

- శాశ్వత చర్యలు చేపట్టండి
- బస్తీల్లో ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి
- ప్రజల సహకారాన్ని కోరండి
- ముఖ్యమంత్రి ఆదేశం

-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో వరద ముంపు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ముంపు నివారణ, పునరుద్ధరణ చర్యల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలేమిని గుర్తించి, సంబంధిత అధికారులకు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి, ముంపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారుల్ని ఆదేశించారు. హైదరాబాద్

-మిగతా 2 లో





## డిజిటల్ ఓటర్ లిస్ట్‌ను బయటపెట్టాలి

- ఈసీని డిమాండ్ చేసిన రాహుల్..!
- ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు కలిసి రావాలి

న్యూఢిల్లీ

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై మరోసారి ఎన్నికల కమిషన్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. 'ఓటు దొంగతనం అనేది ఒక వ్యక్తి, ఒక ఓటు అనే ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రం దాడి. స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటరు జాబితా అవసరం. ఎన్నికల కమిషన్‌కు తమ డిమాండ్ స్పష్టంగా ఉంది.పారదర్శకతను చూపించాలి. డిజిటల్ ఓటర్ లిస్ట్‌ను బయటపెట్టాలి. తద్వారా

-మిగతా 2 లో




## బంగాళాఖాతంలో అల్పపీడనం..!

- దంచికొట్టనున్న వానలు..!

హైదరాబాద్

వాయువ్య బంగాళాఖాతంలో ఈ నెల 13 వరకు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఉత్తర ఇంటీరియర్ కర్నాటక, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఈ క్రమంలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొట్టాయి. అత్యధికంగా నిర్మల్ జిల్లా అక్కాపూర్ గ్రామంలో 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది. అలాగే, సూర్యాపేట జిల్లా ఫణిగిరిలో

-మిగతా 2 లో



## బెంగళూరులో ఎల్లో మెట్రోలైన్ ప్రారంభం

- కర్ణాటక సిఎం, డిప్యూటీ సిఎంతో ప్రధాని మెట్రో రైడ్
- రాష్ట్ర ప్రభుత్వ నిధులే అధికం : సిద్ధరామయ్య

బెంగళూరు

: ప్రధాని మోడీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ కలిసి ఆదివారం మెట్రో రైడ్ చేశారు. బెంగళూరులో ఎల్లో మెట్రో లైన్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీ ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌వి రోడ్ మెట్రో స్టేషన్‌లో ప్రధానికి సిఎం ఆహ్వానం పలికారు. డిప్యూటీ సిఎం డికె శివకుమార్ ప్రాజెక్టు వివరాలను ప్రధానికి వివరించారు. కార్యక్రమం పూర్తయ్యాక ముగ్గురు నేతలు కలిసి కొత్త మెట్రో రైలులో ప్రయాణించారు. కార్యక్రమానికి ముందు ప్రధాని మోడీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి టికెట్ కొనుగోలు చేశారు. అనంతరం ఎల్లో లైన్ మెట్రో సేవలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ మార్గం బెంగళూరు సెంట్రల్ డిస్ట్రిక్ట్‌ను టెక్ హబ్ అయిన ఎలక్ట్రానిక్స్ సిటీతో కలుపుతుంది. ప్రధానితోపాటు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 16 మంది విద్యార్థినిలు, ఎనిమిదిమంది చిన్నారులు, ఎనిమిది మంది మెట్రో కార్మికులు ఈ రైలులో ప్రయాణించారు. వారితో ప్రధాని ముచ్చటించారు.

-మిగతా 2 లో

## బీజేపీలో చేరిన గువ్వల బాలరాజు

- కండువా కప్పి ఆహ్వానించిన రామచందర్‌రావు



హైదరాబాద్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు కండువా కప్పి ఆహ్వానించారు. ప్రాథమిక సభ్యత్వాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే పాల్వాయి

-మిగతా 2 లో

## నెలాఖరులో 'స్థానిక' నగారా

### సన్నద్ధంగా ఉండాలని క్యాడర్‌కు టీపీసీసీ ఆదేశాలు.

పెద్దపల్లి

స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ నెలాఖరులో నగారా మోగే అవకాశాలున్నాయి. ఎన్నికలకు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయాలని టీపీసీసీ నుంచి ఎమ్మెల్యేలు, నాయకులకు ఆదేశాలు అందినట్లు సమాచారం, రాజకీయాల్లో, విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై చేసిన బిల్లులు, ఆర్డినెన్స్‌లు ఆమోదం కోసం రాష్ట్రపతి చెంతకు




చేరాయి. వాటిని ఆమో దించేలా ఇటీవల మూడు రోజుల పాటు రాష్ట్ర

-మిగతా 2 లో

# ప్రతి ఎకరాకు సాగునీరందేలా కృషి

### ఏడాదిలో జవహర్ ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి

- రూ.630 కోట్లతో 33 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ
- 'సీతారామ' పూర్తి చేసి గోదావరి నీటిని ఖమ్మం జిల్లాకు తరలిస్తాం
- బనకచెర్ల ప్రాజెక్టును అన్ని దశల్లో అడ్డుకుంటాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు వాకాటి, ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి

మధిర

కృష్ణ, గోదావరి జలాలను వినియోగించుకుంటూ ఖమ్మం జిల్లాలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఖమ్మం జిల్లా మధిర, ఎర్రుపాలెం మండలాలకు సాగునీరు అందించేందుకు మధిర మండలం వంగవీడు గ్రామంలో రూ.630 కోట్లతో చేపట్టిన జవహర్ ఎత్తిపోతల పథకం పనులకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్



అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్ట రాగమయితో కలిసి భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. మధిర ప్రాంతంలో లభించే నీటిని సద్వినియోగం చేసుకుంటేనే ఇక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికే కట్టలేరు ప్రాజెక్టు ఆధునీకరణ పూర్తి చేశామని తెలిపారు. 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వం

-మిగతా 2 లో



## ఓటర్ పేరును జాబితా నుంచి తొలగించబోం..!

- సుప్రీంకోర్టులో ఈసీ అఫిడవిట్..!

న్యూఢిల్లీ

బిహార్‌లో చేపట్టిన ఓటర్ లిస్ట్ ప్రత్యేక సవరణ విషయంలో తీవ్రమైన నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఓటర్ల జాబితా నుంచి ఓటర్లను తొలగించారన్న ఆరోపణలను తిరస్కరిస్తూ.. అర్హత ఉన్న ఏ ఓటరు పేరును జాబితా నుంచి తొలగించబోమని పేర్కొంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ క్యాంపెయిన్ పై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. పలు రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితా నుంచి 65లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారని ఆరోపణలు రాగా.. సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని సమాధానం చెప్పాలని ఆదేశించింది.ఆగస్టు ఒకటిన ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా నుంచి ఎవరైనా ఓటరు పేరును తొలగించే ప్రక్రియ నిబంధనల ప్రకారం జరుగుతుందని కమిషన్ అఫిడవిట్‌లో పేర్కొంది. పేరును తొలగించే ప్రతిపాదన, అందుకు సంబంధించి కారణాలను ఓటరుకు ముందే తెలియజేస్తారన్నారు. ప్రతి ఓటర్‌కు వాదనలు వినిపించేందుకు అవకాశం, సంబంధిత పత్రాలు

-మిగతా 2 లో




## సింగరేణిని కరప్షన్ గనిగా మార్చిన కాంగ్రెస్

- దసరా తర్వాత హెచ్ఎంఎస్‌తో కలిసి యాత్ర
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్

సింగరేణి సంస్థను కాంగ్రెస్ పార్టీ కరప్షన్ గనిగా మార్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల జాగృతి కార్యాలయంలో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌తో చర్చలు జరిపారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలతో సహా అన్నింట్లో కాంగ్రెస్ పార్టీ అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ అంచనా వ్యయాలను రాత్రికి రాత్రే అమాంతం పెంచారని విమర్శించారు. సంస్థను కాపాడుకోవాలన్న ఉద్దేశ్యంతో కేసీఆర్

-మిగతా 2 లో

## పాక్‌కు గట్టి ఎదురుదెబ్బ

(మొదటి తరువాయి)

దాయాదికే భారీ నష్టం ఎదురైంది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 20 వరకు పాక్ తమ గగనతలాన్ని మూసివేయడంతో దాదాపు రూ.1240 కోట్లు (భారత కరెన్సీ) నష్టం వాటిల్లిందని పాక్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ పేర్కొన్నట్లు తెలుస్తోంది. భారతపై ఆంక్షల నేపథ్యంలో రోజుకు 100-150 విమానాలపై ప్రభావం పడిందని తెలిపింది. దీని కారణంగా విమానాల రాకపోకలు 20శాతం తగ్గిపోయాయని వెల్లడించింది. ఫలితంగా పాక్ గగనతలాన్ని వినియోగించుకున్నందుకు భారత విమానాలపై విధించే ఛార్జీలపై వచ్చే ఆదాయంపై తీవ్ర ప్రభావం పడినట్లు వివరించింది. మరోవైపు.. ఈ ఆంక్షలను ఆగస్టు 24 వరకు పొడిగించారు. దీనికి ప్రతిగా భారత్ కూడా పాక్ విమానాలకు తమ గగనతలాన్ని మూసివేసింది. పహల్గాంలో ఉగ్రదాడి ఘటనపై దేశమంతా ఆందోళన వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఉగ్రవాదులను పోషిస్తున్న పాక్‌పై భారత్ కఠిన చర్యలు తీసుకుంది. అందులోభాగంగా సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతోపాటు పాక్ పౌరులు తక్షణమే భారత్‌ను విడిచివెళ్లాలని ఆదేశించింది. అనంతరం భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి.. పాక్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చింది.

## డిజిటల్ ఓటర్ లిస్ట్‌ను బయటపెట్టాలి

(మొదటి తరువాయి)

ప్రజలు, రాజకీయ పార్టీలు దాన్ని స్వయంగా ఆడిట్ చేయాలి. మీరు కూడా మాతో చేరి ఈ డిమాండ్‌కు మద్దతు ఇవ్వొచ్చు. votechori.in/ecdemand వెబ్‌సైట్‌లోకి వెళ్లండి.. లేదంటో 9650003420 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వండి' అని రాహుల్ పిలుపునిచ్చారు. ఈ పోరాటం ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికేనని స్పష్టం చేశారు. వీడియోలో బీజేపీ, ఎన్నికల కమిషన్ కుమ్మక్కై ఎన్నికల్లో భారీ మోసానికి పాల్పడ్డారని మరోసారి ఆరోపించారు. కర్నాటకలోని ఓ నియోజకవర్గం పరిధిలో ఓటరు విశ్లేషణకు సంబంధించి వివరాలను ఉదహరించారు. బెంగళూరు సెంట్రల్‌లోని కేవలం ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో లక్షకుపైగా ఫేక్ ఓటర్లను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ లోక్‌సభ స్థానం బీజేపీ గెలిచేందుకు సహాయపడిందన్నారు. 70-100 సీట్లలో ఇలా జరిగితే ఎలా ఉంటుందో ఊహించుకోవాలని.. ఇది స్వేచ్ఛా ఎన్నికలను నాశనం చేస్తుందన్నారు.తమ వద్ద ఆధారాలు ఉన్నాయని.. ఓట్ల దొంగతనంపై తాము శక్తిమేరకు పోరాడుతామన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు తమతో కలిసి రావాలని కోరారు. ఒక వ్యక్తి పోర్టల్‌లో నమోదు చేసుకునే సమయంలో 'ఓటు దొంగతనం'కు వ్యతిరేకమని పేర్కొంటూ.. అతని పేరుపై ఓ సర్టిఫికెట్ జారీ చేయబడుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి డిజిటల్ ఓటరు జాబితా కోసం రాహుల్ గాంధీ డిమాండ్‌కు తాను మద్దతు ఇస్తున్నానంటూ ఆ సర్టిఫికెట్‌లో ఉంటుంది. ఈ సర్టిఫికెట్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, ఆ పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్ సంతకాలుంటాయి.

## బంగాళాఖాతంలో అల్పపీడనం..!

(మొదటి తరువాయి)

9.1, ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో 8.1 సెంటీమీటర్లు, వరంగల్ జిల్లా దుగ్గొండిలో 6.7 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని చెప్పింది. అలాగే, కుమ్రంభీం, పెద్దపల్లి, జగిత్యాల, భూపాలపల్లి, హన్మకొండ, సిద్దిపేట, వరంగల్, సంగారెడ్డి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి.మరికొన్ని చోట్ల మోస్తరు వర్షపాతం రికార్డయ్యింది. మరో వైపు రాగల వారం రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది.ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నల్గొండ, మహబూబాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు.. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని హెచ్చరించింది. శుక్ర, శనివార్లాలోనూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడుతాయని వాతావరణ కేంద్రం వివరించింది.

## బెంగళూరులో ఎల్లో మెట్రోలైన్ ప్రారంభం

(మొదటి తరువాయి)

దేశీయ సాంకేతికత, మేక్ ఇన్ ఇండియాతోనే 'ఆపరేషన్ సిందూర్' విజయం : ప్రధాని మోడీ'ఆపరేషన్ సిందూర్' విజయం వెనుక భారతీయ సాంకేతికత, మేక్ ఇన్ ఇండియా ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. దేశీయ టెక్నాలజీ, మేక్ ఇన్ ఇండియా కొన్ని గంటల్లో పాకిస్తాన్?ను మోకరిల్లేలా చేశాయన్నారు. 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా ప్రపంచం మొదటిసారిగా భారతదేశం తాలుకా కొత్త ముఖాన్ని చూసిందని, పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను నాశనం చేయడంలో దాని సామర్థ్యాన్ని ప్రదర్శించిందని స్పష్టం చేశారు.

కర్ణాటకకూ ప్రాధాన్యత ఇవ్వండి : సిద్ధరామయ్య

మెట్రో ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వ నిధుల కంటే రాష్ట్ర ప్రభుత్వ నిధులే అధికమని కర్ణాటక సిఎం సిద్ధరామయ్య చెప్పారు. రాష్ట్రం రూ.25,387 కోట్లు ఖర్చు చేస్తే, కేంద్రం రూ.7,468 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని చెప్పారు. కేంద్రం ఇచ్చిన నిధుల్లో ఎక్కువ భాగం రుణాలు, ఈక్విటీ రూపంలో ఇచ్చిందన్నారు. రాష్ట్రం వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఇప్పటివరకూ 3,987 కోట్లు తిరిగి చెల్లించామని తెలిపారు.

## సింగరేణిని కరప్షన్ గనిగా మార్చిన కాంగ్రెస్

(మొదటి తరువాయి)

సింగరేణిలో రాజకీయ అవినీతిని అంతం చేశారనీ, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి మళ్లీ పెరిగిందని ఆరోపించారు. సింగరేణి సంస్థను కేంద్ర విజిలెన్స్, సీబీఐ పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికి హెచ్ఎంఎస్‌తో కలిసి త్వరలో సింగరేణి యాత్ర చేపడతామని ప్రకటించారు. కార్మికుల హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగడతామని స్పష్టం చేశారు. బోనస్ విషయంలో కార్మికులను ఆ పార్టీ నయవంచనకు గురిచేసిందని ఆరోపించారు. లాభాల్లో 33 శాతం వాటా బోనస్‌గా ఇస్తున్నామని చెప్పి లాభాలనే తక్కువ చేసి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులకు ఈ ఏడాది దసరా బోనస్ లాభాల్లో 37 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ముప్పును తప్పించండి

(మొదటి తరువాయి)

నగరంలో గడచిన నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనేక బస్తీల్లోకి వరద నీరు చేరింది. ఇండ్లలోకి వర్షం నీరు వచ్చి స్థానిక ప్రజలు అనేక అవస్థలు పడ్డారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), హైడ్రా, రెవెన్యూ అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వర్షం కొంత తగ్గుముఖం పట్టడంతో సీఎం రేవంత్‌రెడ్డి బల్కంపేట, అమీర్‌పేట మైత్రివనం, బుద్ధనగర్, గంగూబాయి బస్తీ ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కలియతిరిగారు. గల్లీల్లో తిరుగుతూ వరద ముంపు వల్ల ప్రజలకు కలిగిన ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశారు. వర్షం నీరు కాలువల్లోకి ఎందుకు రావట్లేదని అక్కడి అధికారుల్ని ప్రశ్నించారు. బుద్ధ నగర్ వద్ద కాలనీ రోడ్ల కంటే ఎత్తులో నాలాపై బ్రిడ్జి నిర్మించిఉండటాన్ని గమనించి, అలాగైతే నీరు నాలాలోకి ఎలా వెళ్తుందని అడిగారు. దీనితో అధికారులు సమాధానం చెప్పేందుకు తడబడ్డారు. కాలనీ రోడ్లకంటే నాలాలపై వేసే శ్లాబులు ఎత్తుగా ఉండటం వల్లే ఇండ్లలోకి వర్షం నీరు వస్తున్నదని స్థానికులు కూడా సీఎంకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పనులు చేపట్టేటప్పుడు స్థానిక ప్రజల అభిప్రాయాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోవట్లేదని ఈ సందర్భంగా సీఎం జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల్ని ప్రశ్నించారు. నాలాల్లో పూడికతీత పనులు ఎప్పుడు చేపట్టారని ఆ వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. స్థానిక మహిళలను దగ్గరకు పిలిపించుకొని, వారి సాదకబాదకాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు స్థానికులు వరద నీరు సాఫీగా వెళ్లకుండా గంగూబాయిబస్తీ వద్ద కొందరు నాలాలను పూడ్చేసి, ఆక్రమిస్తున్నారని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. 'అక్కడికి వెళ్దాం పదండి' అంటూ స్థానిక ప్రజలు, అధికారులతో కలిసి గంగూ బాయి బస్తీకి వెళ్లారు. అక్కడ నాలాపై అక్రమ నిర్మాణాలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణం అక్కడి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఆదేశించారు.

బుద్ధనగర్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులతో సీఎం మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగారు. జీతాలు ఇస్తున్నారా అని ఆరా తీసారు. అక్కడ డ్రైనేజీలో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పనిని పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులు తమ విధుల్లో నిమగమై, సీఎంను పట్టించుకోకుండా పూడిక తీస్తుండటంతో స్థానిక అధికారి ఒకరు వారిని పని ఆపమనిచెప్పారు. దీంతో సీఎం సదరు అధికారిపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. 'వారి పని వారిని చేయనివ్వండి. పనులు ఆపొద్దు' అని అక్కడే నిలబడి డ్రైనేజీల్లోంచి తీస్తున్న పూడిక పనుల్ని పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక ట్రంక్ లైన్ ఏర్పాటు చేసి వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనీ, ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల వరద నీరు భారీగా నిలిచిపోయిన మైత్రీవనం చౌరస్తాలో పర్యటించారు. నీరు నిలువడానికి కారణాలు ఏంటని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. వర్షాలు వచ్చినప్పుడు నీరు సాఫీగా నాలాల ద్వారా వెళ్లిపోయేలా చూడాలనీ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ పర్యటనలో కొందరు మహిళలు సీఎంకు రాఖీలు కట్టారు.

**ఎక్స్'లో సీఎం పోస్ట్**

"బల్కంపేట ప్రాంతంలోని బుద్ధనగర్, గంగుబాయి బస్తీ, మైత్రీవనం ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించాను. భారీ వర్షాల సమయంలో కాలనీల్లోని ప్రాంతాల్లో సాధ్యమైనంత త్వరగా నీటి ప్రవాహం వెళ్లిపోయి, ముంపు తలెత్తకుండా తీసుకుంటున్న చర్యలను, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించాను. భారీ వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన కార్యచరణపై అధికారులకు పలు సూచనలు చేశాను. బస్తీ వాసులతో మాట్లాడి సాధకబాధకాలు నేరుగా అడిగి తెలుసుకున్నాను" అని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఫోటోలను పోస్ట్ చేశారు. దానికి 'ప్రజాపాలన. తెలంగాణ ప్రజా ప్రభుత్వం' అనే హ్యాష్‌ట్యాగ్‌ను జోడించారు.

**ప్రజలు ఇబ్బంది పడొద్దు :** ఇన్‌చార్జి మంత్రి పొన్నం సమీక్ష

వర్షాకాలం పూర్తయ్యే వరకూ హైదరాబాద్ నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఆదివారంనాడాయన జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షాలు, వరదలు, సీజనల్ వ్యాధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి, ట్రాఫిక్, విద్యుత్, ఇరిగేషన్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, లోతట్టు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాలాల నిర్వహణ, డ్రైనేజీల్లో పూడికలు సహా పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

**బాలుడితో మాటా ముచ్చట**

అమీర్‌పేటలోని బుద్ధనగర్‌లో పర్యటిస్తుండగా అటుగా వెళ్తున్న ఏడవ తరగతి విద్యార్థి జశ్వంత్‌ను సీఎం దగ్గరకు పిలిచారు. భుజం మీద చెయ్యివేసి, మాట్లాడుతూ ఆ బస్తీలో తిరిగారు. వర్షాలు, వరదల

## ప్రతి ఎకరాకు సాగునీరందేలా కృషి

(మొదటి తరువాయి)

జవహర్ ఎత్తిపోతల పథకానికి మంజూరు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఈ పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు సంగతే పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ ఈ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు తీసుకొచ్చి సర్వే నిర్వహించి, నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. పాలేరు నుంచి సత్తుపల్లి వరకు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారానే పంటలు పండుతున్నాయని తెలిపారు. ప్రతి రోజూ 11 టీఎంసీల నీరు ఏపీ తీసుకుంటుందని, ఈ దోపిడీ ఇలాగే కొనసాగితే 20 రోజుల్లో శ్రీశైలం ఖాళీ అవుతుందని, నాగార్జునసాగర్ చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందేలా పోరాటాలు కొనసాగించాలన్నారు. జలవనరుల శాఖ నుంచి కోర్టు వరకు అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ రాయలసీమ ప్రాజెక్టులు, బనకచర్ల ప్రాజెక్టులను అడ్డుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కూడా రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆపాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం 7 మండలాలను ఏపీకి కట్టబెట్టడం అన్యాయమన్నారు. బనకచర్ల ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని, తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసిన తర్వాత, వరద జలాల్లో మన వాటా తేలిన తర్వాతే కింది రాష్ట్రాలు ప్రాజెక్టుల గురించి ఆలోచించాలన్నారు.

**జవహర్ ఎత్తిపోతల పథకం ఏడాదిలో పూర్తి : మంత్రి ఉత్తమ్**

మధిర ప్రాంతానికి గేమ్ చేంజర్‌గా జవహర్ ఎత్తిపోతల పథకం ఉంటుందని చెప్పారు. రూ.630 కోట్లతో చేపట్టిన ఈ ఎత్తిపోతల పథకం పనులను ఏడాదిలోపు పూర్తి చేయాలని నీటి పారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా 33 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, వైరా నదిలో 120 రోజుల్లో 4 టీఎంసీలు ఎత్తిపోసేలా ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశామని, దీని నిర్మాణానికి 190 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంటుందని, ఇందుకోసం రూ.45 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

## ఓటర్ పేరును జాబితా నుంచి తొలగించబోం..!

(మొదటి తరువాయి)

అందించేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు చెప్పింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మొదటి దశ పూర్తయిందని కమిషన్ చెప్పుకొచ్చింది. తొలిదశలో దాదాపు 7.24కోట్ల మంది ఓటర్లు తమ సంబంధించి పత్రాలను సమర్పించారని.. వీటన్నింటిని సవర్తించిన జాబితాలో చేర్చనున్నట్లు తెలిపింది. ఆయా పేర్లన్నింటిని డిజిటలైజ్ చేశారని, తొలగించబడిన ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు అందజేయనున్నట్లు తెలిపింది. తొలి దశను విజయవంతం చేసిన ఘనత బిహార్ ప్రధాన ఎన్నికల అధికారితో పాటు 38 జిల్లాల ఎన్నికల అధికారులు, 243 మంది ఈఆర్‌వోలు, 2976 మంది ఏఈఆర్‌వోలు, 77,895 మంది బీఎల్‌వోలు, వలంటీర్లు, 12 రాజకీయ పార్టీల అధ్యక్షులు, వారు నామినేట్ చేసిన 1.6లక్షల బీఎల్ఏలకు దక్కుతుందని చెప్పింది. ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు ఎవరైనా ఓటరు జాబితాలో సవరణల కోసం ఫిర్యాదులతో పాటు అభ్యంతరాలు చెప్పవచ్చని పేర్కొంది. సర్ ప్రక్రియను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లు విచారించిన సర్వోన్నత న్యాయస్థానం పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగిస్తే వెంటనే జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. ఆధార్ కార్డ్, ఓటర్ ఐడీలను చెల్లుబాటయ్యే పత్రాలుగా పరిగణించాలని.. పేర్లను తొలగించే బదులు చేర్చే ప్రక్రియపై దృష్టి పెట్టాలని సూచించింది. ఆగస్టు 6న, బీహార్ ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన సుమారు 65 లక్షల మంది ఓటర్ల పూర్తి సమాచారాన్ని ఆగస్టు 9 నాటికి సమర్పించాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అనే ఎన్‌జీవోతో పాటు పలు రాజకీయ పార్టీలకు సైతం అందించాలని సూచించింది.

## బీజేపీలో చేరిన గువ్వల బాలరాజు

(మొదటి తరువాయి)

హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కల్వకుర్తి ఇన్‌చార్జి తల్లోజు ఆచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు యాదవ్, ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఎన్వీ.సుభాశ్, కోశాధికారి శాంతికుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట నియోజకవర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ..తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి 13.9 శాతం ఓటింగ్ వస్తే పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి అది 36 శాతానికి పెరిగిందని వివరించారు. మూడు ఎమ్మెల్సీ స్థానాలు గెలిచామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో సున్నా అయిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తమ పార్టీదే గెలుపు అని చెప్పారు. హరీశ్‌బాబు మాట్లాడుతూ%ౌ%ఉత్తర తెలంగాణలో బీజేపీ పట్టిసాధించిందనీ, రానున్న రోజుల్లో దక్షిణ తెలంగాణలో చేరికల పరంపరతో బలపడతామని చెప్పారు. బాలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలను దశాబ్దాలుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం చేస్తూ పోతున్నాయని విమర్శించారు. అన్నిరకాలుగా అధ్యయనం చేసిన తర్వాతనే మోడీ ప్రజా సంక్షేమానికి ఆకర్షితుడినై బీజేపీలో చేరుతున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంపోర్టెడ్ నాయకత్వంలో నడుస్తున్నదని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు భిక్షపెట్టారనీ, ఆయన ఎవ్వరికీ భిక్ష పెట్టలేదని విమర్శించారు. కేటీఆర్ వయస్సులో తన కంటే ఆరు నెలలో, ఏడాదో పెద్దనీ, ఆయన ముందు తానెలా బచ్చా అవుతానని ప్రశ్నించారు. తన కుటుంబంపై సోషల్‌మీడియాలో ట్రోలింగ్‌లు ఆపాలని బీఆర్ఎస్ నేతలను కోరారు. లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయనీ, న్యాయపరంగానూ ముందుకెళ్తానని హెచ్చరించారు.

## నెలాఖరులో 'స్థానిక' నగారా

(మొదటి తరువాయి)

ముఖ్యమంత్రి సహ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు ఢిల్లీలోనే ఉన్నారు. జంతర్ మంతర్ వద్ద ఇండియా కూటమి ఎంపీలతో కలిసి ధర్నా చేశారు. పార్లమెంట్‌లో చర్చకు వాయిదా తీర్మానాలు ఇస్తే ప్రభుత్వం తోసి పుచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన మేరకు గడువు ముంచుకు వస్తున్నది. ఆ గడువులోగానే ఎన్నికలు నిర్వహించేం దుకు ముందుకు పోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఓవైపు..42 శాతం బీసీ రిజర్వేషన్లపపై కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే, మరోవైపు ఎన్నికల నిర్వహణకు అధికార పార్టీ సన్నద్ధం అవుతున్నది. రాజకీయాల వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో, మంత్రులతో చర్చించిన తర్వాత ఎన్నికలపై ముందుకు సాగుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు రెండు, మూడు రోజుల్లో సమావేశాలు నిర్వహిం చేందుకు సన్నద్ధం అవుతున్నారని పార్టీ వర్గాల సమాచారం. ఎన్నికల విషయమై ప్రభుత్వం మూడు మార్గాలను అన్వేషిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో తీసుక వచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్న 50 శాతం రిజర్వేషన్ల నిబంధనను పక్కనబెట్టి జీఓ తీసుకరావడం, ఎన్నికలు నిర్వహించకుండా నిలువరించడం, పార్టీ పరంగా 42 శాతం సీట్లు కేటాయించే మార్గాలను అన్వేషిస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఇప్పటికే ఆలస్యమయ్యింది. ఏడాది నుంచి ఏడాదిన్నర కాలంగా మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలు, ఆరు మాసాలుగా మున్సి పాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. ఎన్నికల నిర్వహణలో జాప్యంపై ప్రభుత్వంపై రాజకీయ పక్షాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

**పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించే యోచన**

రిజర్వేషన్లపై జీఓ తీసుక వస్తే ఎవరైనా కోర్టును ఆశ్రయించే అవకాశాలు న్నాయి. చివరగా పార్టీ పరంగా 42 శాతం సీట్లు బీసీలకు కేటాయించి ముందుకు పోవాలని భావిస్తున్నారు. మొదట జీఓ జారీ చేసి, దాని పర్యావసానాన్ని గమనిం చిన తర్వాత ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఎట్టిపరిస్థితుల్లో ఈ నెలాఖరు వరకు గ్రామ పంచాయతీ లేదా మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఏదో ఒక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి 50 శాతానికి మించకుండానే జనాభా, ఓటర్ల ప్రాతిపదికన స్థానాలను రిజర్వు చేయనున్నారు. సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ స్థానాలకు రొటేషన్ ప్రకారమే రిజర్వు చేయనున్నారు.


# రాఖీ పండుగ వేళ మెట్రోలో 81 లక్షల మంది ప్రయాణం..



**న్యూఢిల్లీ ఆగస్టు 10 తరంగాలు**
రాఖీ పండుగ వేళ ఢిల్లీ మెట్రో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒక్క రోజులోనే లక్షల మంది ప్రయాణించారు. ఆగస్టు 8వ తేదీన 81,87,674 మంది ప్రయాణించినట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ శనివారం ప్రకటించింది. ఆగస్టు 8న 92 ట్రిప్పులు అదనంగా నడిపారు. రాఖీ పండుగ రోజు శనివారం నాడు 455 అదనపు ట్రిప్పులు నడిపినట్లు పేర్కొన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని మెట్రో రైళ్లను నడిపినట్లు తెలిపారు. ఇక ఢిల్లీ మెట్రోను ప్రయాణికులు అభినందించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనంగా సర్వీసులను నడిపినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రద్దీగా ఉన్న స్టేషన్లు, మెట్రో రైళ్ల ఫొటోలను, వీడియోలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు ప్రయాణికులు. నిలబడేందుకు ప్లేస్ లేకుండా కిక్కిరిసిగా మారాయి మెట్రో రైళ్లు, స్టేషన్లు. దీంతో ప్రయాణికులకు ఊపిరాడలేదు. ఆ జనాన్ని చూసి మెట్రో సిబ్బంది కూడా షాకయ్యారు. ఢిల్లీ మెట్రోకు పండుగ వేళ భారీగా డిమాండ్ ఉంటుంది. చాలా మంది మెట్రో ప్రయాణాన్ని ఎంచుకుంటున్నారు. ఢిల్లీ మెట్రో మొత్తం 400 కిలోమీటర్ల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ఢిల్లీతో పాటు సమీప పట్టణాలు నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, ఫరీదాబాద్, బహదూర్‌గర్హ్ వరకు మెట్రో సేవలు కొనసాగుతున్నాయి.

# జార్జియాలోని ఓ ఇంటిపై రాలిపడిన పురాతన ఉల్క.

## దాని పరిమాణం ఎంతంటే..!



**జార్జియా ఆగస్టు 10 తరంగాలు**
అమెరికా లోని జార్జియా లో ఓ ఇంటిపై ఇటీవల పురాతనమైన ఉల్క రాలిపడింది. ఆ ఉల్కను పరిశీలించిన శాస్త్రవేత్తలు సంచలన విషయాలు వెల్లడించారు. ఆ ఉల్క భూమికంటే పురాతనమైందని చెప్పారు. జూన్ 26న జార్జియాలోని మెక్‌డొనౌగ్ లో ఓ ఇంటిపై ఉల్క శకలం పడింది. అది ఇంటి పైకప్పును శిథిలం చేస్తూ నేలను తాకింది. సూపర్ సోనిక్ వేగంతో ఆ ఉల్క భూమిపై పడినప్పుడు వచ్చిన శబ్దం చాలా దూరం వినిపించింది. చిన్న చెర్రీ పండు పరిమాణంలో 23 గ్రాముల బరువున్న ఉల్క శకలం తాకిడికి నేలపై చిన్న గుంత ఏర్పడింది. ఈ శకలాన్ని పరిశీలించిన జియాలజిస్టులు.. అది దాదాపు 4.56 బిలియన్ సంవత్సరాల క్రితం తయారైందని చెప్పారు. అంటే అది భూమికంటే దాదాపు 2 కోట్ల సంవత్సరాల పూర్వం ఏర్పడిందని చెప్పారు. ఆ గ్రహశకలం అంగారకుడు, బృహస్పతికి మధ్య ఉన్న ఓ తోకచుక్క నుంచి విడివడ్డ శకలం అయి ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

# ఇండిగో ఎయిర్ లైన్స్‌కు లక్షన్నర జరిమానా



**న్యూఢిల్లీ ఆగస్టు 10 తరంగాలు**
ఓ ప్రయాణికురాలికి అపరిశుభ్రమైన, అసౌకర్యవంతమైన సీటును కేటాయించినందుకుగాను ఇండిగో ఎయిర్ లైన్స్‌కు ఢిల్లీ వినియోగదారుల ఫోరం రూ. 1.5 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని సదరు ప్రయాణికురాలికి చెల్లించాల్సిందిగా ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 5వ తేదీన తాను ప్రయాణించిన బాకు-న్యూఢిల్లీ ఇండిగో విమానంలో తనకు అపరిశుభ్రమైన సీటు కేటాయించినట్లు పింకీ అనే మహిళ ఢిల్లీలోని వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. దీని వల్ల తాను శారీరకంగా, మానసికంగా ఇబ్బందిపడినట్లు తెలిపారు. ఫిర్యాదుపై విచారణ జరిపిన కమిషన్ ప్రయాణికురాలు ఎదుర్కొన్న అసౌకర్యం, మానసిక వేదనకు పరిహారం చెల్లించాలని ఇండిగోను ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి ఆమె ఖర్చు చేసిన రూ.25,000 కూడా చెల్లించాలని పేర్కొంది. అయితే.. ఈ ఆదేశాలను ఇండిగో వ్యతిరేకించింది. ప్రయాణికురాలికి కేటాయించిన సీటు సరిగ్గా లేకపోడంతో ఆమె అభ్యర్థన మేరకు తాము వేరే సీటు కేటాయించినట్లు తెలిపింది. అనంతరం ఆమె సౌకర్యవంతంగా తన ప్రయాణాన్ని పూర్తి చేసినట్లు పేర్కొంది. అయినప్పటికీ వినియోగదారుల ప్రయాణ సమాచారాన్ని తెలిపే అంతర్గత కార్యాచరణ రికార్డులలో భాగమైన సిట్యువేషన్ డేటా డిస్‌ప్లే నివేదికను సమర్పించడంలో ఎయిర్‌లైన్స్ విఫలమైనందున జరిమానాను చెల్లించాల్సిందేనని వినియోగదారుల ఫోరం స్పష్టం చేసింది.

# మా విమానాలు ఒక్కటి కూడా దెబ్బతినలేదు: పాక్



**న్యూఢిల్లీ ఆగస్టు 10 తరంగాలు**
ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఇటీవల భారత వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వ్యాఖ్యలపై తాజాగా పాక్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ స్పందించారు. భారత్ చేసిన దాడుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఒక్క యుద్ధ విమానం కూడా దెబ్బతినలేదని ఆయన అన్నారు. తాము అంతర్జాతీయ మీడియాకు వివరాలు వెల్లడించామన్నారు. మూడు నెలలుగా ఎలాంటి వాదనలు లేవని, ఇంత ఆలస్యంగా చేసిన వాదనలు నమ్మశక్యంగా లేవని పేర్కొన్నారు. ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ఇటీవల బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన గగనతల రక్షణ వ్యవస్థ ఎస్ - 400 క్షిపణి వ్యవస్థలు సమర్థవంతంగా పని చేశాయన్నారు. పాక్ ప్రధాన ఎయిర్ ఫీల్డ్‌లలో షహబాజ్ జకోబాబాద్ స్థావరం సగానికి పైగా దెబ్బతిందని, కనీసం ఐదు యుద్ధ విమానాలు తీవ్రంగా దెబ్బతిన్నాయనే అంచనాకు వచ్చామని సింగ్ వెల్లడించారు.

# పాక్‌తో మేం చెస్ గేమ్ ఆడాం

## ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది




**న్యూఢిల్లీ ఆగస్టు 10 తరంగాలు**
ఐఐటీ మద్రాస్‌లోని అగ్నిశోధ్-ఇండియన్ ఆర్మీ రీసెర్చ్ సెల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ సిందూర్‌లో మేం చెస్ గేమ్ ఆడాం. శత్రువు తదుపరి కదలికలు ఎలా ఉండబోతున్నాయో.. మేం ఏం చేయబోతున్నామో మాకు తెలియదు. దీనిని గ్రే జోన్ అంటారు. గ్రే జోన్ అంటే మనం సంప్రదాయ కార్యకలాపాలకు వెళ్లడం లేదు. మనం చెస్ గేమ్‌లో పావుల్లా ముందుకు సాగాం. శత్రువు అంచనా వేయలేని విధంగా దాడులు చేశాం. పాకిస్తాన్, పీఓకేలో ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా దాడులు జరిగాయి అని చెప్పుకొచ్చారు. ఈ ఆపరేషన్ తర్వాత పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు జనరల్ మునీర్‌ను ఆ దేశ 'ఫీల్డ్ మార్షల్'గా నియమించారని ద్వివేది సెటైర్లు వేశారు. వాళ్లు యుద్ధంలో గెలిచినట్లు అక్కడి ప్రజలను భ్రమలో ఉంచి.. ఆర్మీ అధికారికి అత్యున్నత పదవి ఇచ్చారని ఎద్దేవా చేశాడు.

# అమెరికాపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ ఫైర్

## వాళ్లు ప్రతి ఒక్కరికీ తామే బాస్‌లు అనుకుంటున్నారు.

**న్యూఢిల్లీ ఆగస్టు 10 తరంగాలు**
అమెరికా తనపట్ల వ్యవహరిస్తున్న తీరుపై భారత్ మరోసారి మండిపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత వస్తువులపై అదనంగా 25 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో రాజ్‌నాథ్ తాజా వ్యాఖ్యలు చేశారు. కొన్ని దేశాలు భారత ఆర్థిక పురోగతిని అసూయతో చూస్తూ ఆ పురోగతిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. కొందరు 'బాస్'లు భారతదేశం వేగంగా అభివృద్ధి చెందడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. 'మనమే అందరికీ బాస్ అయితే, భారత్ ఇంత వేగంగా ఎలా అభివృద్ధి చెందుతోంది అని వాళ్లు అసూయ




పడుతున్నారు' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లా ఉమరియా గ్రామంలో బీఈఎంఎల్ కొత్త యూనిట్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని దేశాలు భారతీయ ఉత్పత్తులను ఇతర దేశాల ఉత్పత్తుల కంటే ఖరీదైనవిగా చేయడానికి ప్రయత్నిస్తున్నాయని రాజ్‌నాథ్ ఆరోపించారు. తద్వారా ధరలు పెరిగితే ప్రపంచం వాటిని కొనడం మానేస్తుందని ఆ దేశాలు భావిస్తున్నాయని అన్నారు. అయితే భారత్ వేగంగా ముందుకు సాగుతోందని, ఇప్పుడు ఏ శక్తీ భారత్‌ను ప్రపంచంలో గొప్ప శక్తిగా ఎదగకుండా ఆపలేదని చెప్పారు.

# గాజా ఆక్రమణ వద్దంటూ నిరసనల హోరు

**నెతన్యాహు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ఇజ్రాయిల్ ప్రజలు యుద్ధాన్ని ఆపి, బందీలను విడిపించాలని డిమాండ్**

**టెల్ అవీవ్ ఆగస్టు 10 తరంగాలు**
బెంజిమెన్ నెతన్యాహు గాజాను స్వాధీనం చేసుకుంటామన్న ప్రకటనపై ఇజ్రాయిల్ ప్రజలే భగ్గుమంటున్నారు. ప్రధాని నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వేలాదిమంది ప్రజలు టెల్ అవీవ్ వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. నగర ప్రధాన రహదారైన అయలోన్ హైవేను దిగ్బంధించారు. దేశ జెండాలను ప్రదర్శిస్తూ, రోడ్డుపై మంటలు రాజేసి "చాలు యుద్ధాన్ని ఆపండి, బందీలను విడిపించండి " అని నినదించారు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జెరుసలెం, హైఫా, బీట్‌షీన్, నహారియా, కిర్యత్ గాట్, రాన్నా, గోమె జంక్షన్, నెవె ఇలాన్, కార్మియల్, మరికొన్ని ప్రాంతాలకు నిరసనలు విస్తరించాయి. హాస్టేజ్ స్క్వేర్ ప్రాంతంలో జరిగిన నిరసనలో హమాస్ చెరలో ఉన్న



బందీల కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గన్నారు. ప్రభుత్వ ప్రకటనతో వారి ప్రాణాలకు హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం తక్షణమే ఆపి హమాస్‌తో ఒప్పందం చేసుకుని బందీలను విడిపించాలని వారు కోరారు. ఇజ్రాయిల్ మీడియా కథనాల ప్రకారం టెల్ అవీవ్ నిరసనల్లో సుమారు లక్ష మంది పాల్గన్నారు. గాజాపై దాడులు ప్రారంభమైన తరువాత ఇదే పెద్ద ఆందోళన. అంతర్జాతీయంగా అనేక దేశాలు పాలస్తీనాకు మద్దతుగా నిలిచాయి. ఇటీవలే బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలు పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ప్రకటించాయి.

**17న సమ్మె**

గాజా ఆక్రమణకు వ్యతిరేకంగా బాధిత, సైనికుల కుటుంబాలు, అక్టోబర్ కౌన్సిల్ సభ్యులు ఈ నెల 17న సమ్మెకు పిలుపునిచ్చారు. టెల్ అవీవ్‌లోని కిర్యా సైనిక స్థావరం వద్ద జరిగిన పత్రికా సమావేశంలో వారు సమ్మెను ప్రకటించారు. గాజా స్వాదీన ప్రకటన బందీలను మరింత ప్రమాదంలో పడేస్తుందని, అనేకమంది సైనికులు ప్రాణాలు కోల్పోతారని, గాజాలో మానవతా సంక్షోభం మరింత పెరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 17న సమ్మెలో అందరూ పాల్గోవాలని, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, కార్మికులు, ఇతర శ్రామికులు పనిని బహిష్కరించాలని వారు కోరారు. ఈ సమ్మెకు వామపక్ష, ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలిపాయి.

# ఓట్ చోరీ వెబ్ సైట్ ప్రారంభించిన రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ ఆగస్టు 10 తరంగాలు**
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) లక్ష్యంగా తన విమర్శల దాడిని మరింత తీవ్రతరం చేశారు. డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న తన డిమాండ్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు 'ఓట్ చోరీ' పేరుతో నేడు ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని, దానిని అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రచారానికి సంబంధించి రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను పంచుకున్నారు. "వోట్ చోరీని బహిర్గతం చేయడం చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. "దేశంలో జరుగుతున్న ఓట్ల దొంగతనాన్ని ఆపేందుకు ప్రారంభించిన ఈ




ప్రచారానికి మనస్ఫూర్తిగా మద్దతివ్వండి. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటం" అని ఆయన అన్నారు. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితా అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు, పార్టీలు ఓటర్ల జాబితాను తనిఖీ చేసేందుకు వీలుగా ఈసీఐ పారదర్శకంగా వ్యవహరించి డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రచారానికి మద్దతుగా votechori.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 9650003420 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన కోరారు.

## సంపాదకీయం

# పుస్తకాల నిషేధం కాశ్మీర్ విషాదం

జమ్ము కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కార్యాలయం ఏక్ దమ్మున పాతిక పుస్తకాలను నిషేధించడం, ఆ వెంటనే వాటిని జప్తు చేసేందుకు పుస్తకశాలలపై దండయాత్రలకు పోలీసులకు ఆదేశాలివ్వడం ప్రపంచ వ్యాపిత చర్చకు దారితీసింది. మోడీ హయాంలో నిషేధాలు, ఆంక్షలు పరిపాటిగా మారిన మాట నిజమైనా భారత దేశ ప్రజాస్వామిక సంప్రదాయాల రీత్యా ఇంత నిరంకుశమేంటనే ప్రశ్న ప్రతిధ్వనించింది. విచిత్రమేమంటే నిషేధం తర్వాత ఈ రెండో రోజు దేశీయ మీడియా ముఖ్యంగా బడా మీడియా ఆ అంశంపై గప్‌చుప్‌గా వుండగా గార్డియన్, అల్ జజీరా తదితర అంతర్జాతీయ మీడియా దీనిపై విస్తృతంగా కథనాలిస్తున్నాయి. ఎమర్జెన్సీ యాభయ్యవ వార్షికం జరుపుతూ తామే ప్రజాస్వామ్య పరిరక్షకులమైనట్టు ఊరేగుతున్న మోడీ సర్కారు నిజ స్వరూపాన్ని ఈ నిషేధం బట్టబయలు చేసింది. ఏమంటే ఎమర్జెన్సీలో కూడా ఒకేసారి ఇన్ని రకాల పుస్తకాలను నిషేధించే ఉత్తర్వు వచ్చి వుండరు. దీనిపై మీడియా పెద్దగా స్పందించడం లేదంటే అప్రకటిత ఎమర్జెన్సీ అంటే ఏమిటో అర్థమవుతున్నది.

కాశ్మీర్‌కు రాజ్యాంగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 370వ అధికరణాన్ని రద్దు చేసి ఆరేళ్లు పూర్తయ్యాయని హెూంమంత్రి అమిత్ షా కు ఎ.పి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సహా బిజెపి, ఎన్‌డిఎ నాయకులు కీర్తనలాలపిస్తున్న సమయంలోనే ఈ ప్రకటన వెలువడటం ప్రత్యేకంగా గమనించదగింది. అమిత్ షా సమర్థత వల్ల కాశ్మీర్‌లో పరిస్థితి ఎన్నడూ లేనంతగా అదుపులోకి వచ్చిందని ఎన్‌డిఎ సమావేశంలో జబ్బలు చరుచుకున్నారు. పహల్గాం ఘాతుకం తర్వాత అంతా వేగంగా సర్దుబాటు చేసినందుకు మోడీకి సత్కారమే చేశారు. మరో వంక గత వారం రోజులుగా ఉగ్రవాదుల ఏరివేత అంటూ వేట సాగిస్తున్నారు. ఇవన్నీ నిజమే అయితే ఎప్పటెప్పటివో ఈ పుస్తకాల వల్ల కలిగిన ప్రమాదం ఏముంటుంది? వాటిలో కొన్ని కొన్ని దశాబ్దాల కిందటి పరిస్థితిని వివరించేవే తప్ప తాజాగా రాసినవి కూడా కాదే? యువతను పక్కదోవ పట్టిస్తున్నాయని, ఉగ్రవాదులను గొప్ప చేసి సాయుధ దళాలను విలన్లుగా చూపిస్తూ తప్పుడు కథనాలు యువత బుర్రలో జొప్పిస్తున్నాయనే ఆరోపణతో నిషేధించడమంటే యువత అసంతృప్తి ఏమాత్రం తగ్గలేదని అర్థం చేసుకోక తప్పదు. మరి నిజంగా మోడీ, షా ద్వయం అంత అద్భుతంగా కాశ్మీర్‌ను బాగు చేసి వుంటే వారి తరపున యువత నిలబడేవారు తప్ప ఎవరో రాసిన పుస్తకాలతో కొట్టుకుపోతారా?

**ప్రముఖ రచయితలపై వేటు**

వాస్తవానికి ఈ పుస్తకాలు రాసిన వారెవరూ అల్లాటప్పా రచయితలు కాదు. విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులూ న్యాయ శాస్త్రంలో ఆరితేరిన అధ్యయనపరులు, పత్రికా రంగంలో పట్టున్న పరిశోధకులని ఆ జాబితా చూస్తేనే తెలుస్తుంది.

తాము ఏ ఉగ్రవాదాన్ని సమర్థించలేదనీ, సాయుధ దళాలపై దాడి చేయడం అసత్యమనీ వారిలో చాలా మంది నిషేధం తర్వాత నిష్కర్షగా చెబుతున్నారు. పైగా వాటిని పాలకులే వివిధ సందర్భాలలో మెచ్చుకోవడం గుర్తు చేస్తున్నారు. ఉదాహరణకు దేవిడ్ దేవదాసు రాసిన భవిష్యత్తు కోసం అన్వేషణ (ఇన్ సెర్చ్ ఆఫ్ ఫ్యూచర్) అనే గ్రంథాన్ని 1988లో ఎన్‌డిఎ మాజీ కన్వీనర్, మాజీ రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ స్వయంగా ఆవిష్కరించారు. మరి కొన్నింటిని మాజీ ప్రధాని వాజ్‌పేయి ప్రశంసించారు. అరుంధతీ రారు ప్రతిష్టాత్మక బుకర్ పురస్కారం పొందిన శక్తివంతమైన రచయిత్రి. మానవ హక్కుల కోసం పోరాడే వ్యక్తి. ఎ.జి. నురానీ అయితే రాజ్యాంగ సభ చర్చల నుంచి నాయకుల వ్యాఖ్యలు, ప్రసంగాలు, రచనల వరకూ తు.చ తప్పకుండా ఉటంకిస్తూ తప్ప ఏమీ చెప్పరు. ఆయన కాశ్మీర్ సమస్యను 1947-2012 వరకూ రాశారు గనక మోడీ సర్కారే లేదు. అలాంటప్పుడు 2025లో అది చేసే వ్యతిరేక ప్రచారం ఏముంటుంది? మిగిలిన ఆస్ట్రేలియాకు చెందిన క్రిస్టోఫర్ స్నెడెన్ 1993 తర్వాత ప్రత్యేకించి పరిశీలించి రాశారు. తన గ్రంథంలో వీసమెత్తయినా రెచ్చగొట్టే సమాచారం లేదని ఆయన సవాలు చేస్తున్నారు. ఈ చర్య మరింత పెద్ద దాడికి సూచన అన్నారు కాశ్మీర్ టైమ్స్ ఎడిటర్ అనురాధా బాసిన్, లండన్ ప్రొఫెసర్ సమంత్రా బాస్ కూడా అదే విధంగా ఆశ్చర్యం వెలిబుచ్చారు. ఇంటర్నెట్ ఫ్రీడం ఫెడరేషన్ (ఐ.ఎఫ్.ఎఫ్), ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటివి కూడా నిషేధంపై తీవ్ర నిరసన ప్రకటించాయి.

**రాజకీయాలు, సాయుధ దళాలు**

కాశ్మీర్ సమస్య నిజమైనప్పుడు-దాని మీద భారత్ పాకిస్తాన్‌ల మధ్య వివాదాలు ఘర్షణలు నడుస్తున్నప్పుడు%ొ% దేశంలో పాలక పార్టీలైన కాంగ్రెస్, బిజెపి రాష్ట్రంలో నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి, హురియత్ వంటివి విభిన్న వాదనలతో పని చేస్తున్నపుడు ప్రభుత్వాల ఏర్పాటు, కూల్చివేత, షేక్ అబ్దుల్లాతో సహా కీలక నేతల నిర్బంధాలు, విడుదలలు నడుస్తున్నప్పుడు రచయితలు వాటిని స్పృశించకూడదా? వారే ఆ లోతుపాతుల్లోకి వెళ్లి రాయకపోతే ప్రజలకు విభిన్న కోణాలు, వాస్తవాలు ఎలా తెలుస్తాయి? పార్టీల వాదనలో ఏది నిజమో ఏది పొరబాటో ఎలా తెలుస్తుంది? పాకిస్తాన్ కుట్రల వల్ల ఉగ్రవాదానికి ఊతం లభించి కల్లోలం నెలకొన్న మాట నిజమే కానీ దేశంలో పాలకుల అవకాశవాదాల మాటేంటి? మాట మార్పులేంటి? కలయికలు ఫిరాయింపులు ఎన్ని జరగలేదు? వీటిని అక్షరబద్ధం చేయడం రచయితల బాధ్యత కదా? వారితో పూర్తిగా ఏకీభవించకపోయినా చరిత్ర, రాజకీయాలు, రాజ్యాంగం కోణాలను ఆవిష్కరించడం మరింత కీలకం కదా?

ఇక్కడ పదే పదే సాయుధ దళాల ప్రసక్తి తీసుకు రావడం సమస్యను పక్కదోవ పట్టించడమే. వాటికి వుండే విలువ, గౌరవం వుంటాయిగానీ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నిర్ణయాలు, పాలనా వ్యవస్థ కీలకం తప్ప సైన్యం సాయుధ బలగాలు కాదు. కాశ్మీర్‌తో సహా ఈశాన్య రాష్ట్రాలలోనూ కల్లోలిత ప్రాంతాల్లోనూ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్ యాక్ట్ (ఎ.ఎఫ్.ఎస్.పి.ఎ) కింద హక్కుల ఉల్లంఘనలు జరిగాయనే కేసులను పలు సార్లు సుప్రీం కోర్టు విచారణకు చేపట్టింది. నిజానికి ఇలాంటి సందర్భాల్లో వారిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతివ్వాలని బిజెపి భాగస్వామిగా వున్న పిడిపి మిశ్రమ ప్రభుత్వమే కోరింది. కానీ ఆ చట్టం కింద కేంద్రం ముందస్తు అనుమతి లేకుండా వారిపై విచారణకు అనుమతించలేమని కోర్టు తేల్చిచెప్పింది. ఇవన్నీ వాస్తవాలైనప్పుడు ప్రసిద్ధ రచయితలు వాటిని పరిశీలించి పరిశోధించి రాయడం తప్పెలా అవుతుంది? నిషేధం ఎలా చెల్లుతుంది?

### బీహార్ డిప్యూటీ సీఎంకు

# రెండు ఓటరు కార్డులు

### తేజస్వీ యాదవ్ ఆరోపణ



**పాట్నా ఆగస్టు 10 తరంగాలు**

బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ వివాదం కొత్త మలుపు తిరిగింది. బీజేపీ నేత, డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హాకు రెండు ఓటరు కార్డులున్నాయని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలను మీడియా ముందు బయటపెట్టారు. ఉప ముఖ్యమంత్రి సిన్హాకు వేర్వేరు అసెంబ్లీ సెగ్మెంట్లలో రెండు ఎపిక్ నంబర్లు ఉన్నాయని ఆరోపించారు. ఈ రెండు ఓటరు కార్డుల్లో ఆయన వయస్సు కూడా భిన్నంగా ఉన్నదని విమర్శించారు. బంకిపూర్ సెగ్మెంట్‌లో ఉన్న ఓటరు కార్డులో 60 ఏళ్ల వయస్సు, లఖిసరాయ్‌లోని ఓటరు కార్డులో 57 ఏళ్ల వయస్సు ఉన్నదని తెలిపారు. 'ఈ రెండు ఎపిక్ నంబర్‌ల జారీకి సంబంధించిన పత్రాలపై ఆయన సంతకం చేసి ఉండాలి లేదా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ మొత్తం మోసపూరితమైనది' అని ఆరోపించారు. ఈ మోసానికి పాల్పడిన సిన్హాపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.కాగా, తేజస్వీ యాదవ్ ఆరోపణలను డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా ఖండించారు. తన కుటుంబం గతంలో బంకిపూర్ అసెంబ్లీ ప్రాంతంలో నివసించిందని తెలిపారు. దీంతో అక్కడి ఓటరు జాబితా నుంచి తన పేరును తొలగించాలని కోరుతూ ఫారమ్ నింపినట్లు చెప్పారు. లఖిసరాయ్ ఓటరు జాబితాలో తన పేరును చేర్చినట్లు వివరించారు. 'జంగిల్ రాజ్ యువరాజు మోసం చేస్తాడు. మేం అలాంటి చర్యలకు పాల్పడం. దురదృష్టవశాత్తు రాజ్యాంగ పదవిలో ఉన్న ఒకరు సరైన జ్ఞానం లేకుండా రాజకీయాలను దుర్వినియోగం చేస్తున్నారు' అని తేజస్వీ యాదవ్‌పై ఆయన మండిపడ్డారు.

# రాహుల్ గాంధీకి కర్నాటక ఎన్నికల అధికారి నోటీసులు..!



**న్యూఢిల్లీ ఆగస్టు 10 తరంగాలు**

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కర్నాటక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఓట్ల దొంగతనంపై ఆయన చేసిన ఆరోపణలకు సంబంధించి డాక్యుమెంటరీ ఆధారాలను సమర్పించాలని కోరారు. మహదేవపుర నియోజకవర్గంలోనే నకిలీ ఎంట్రీలు, ఫేక్ అడ్రస్‌లు, ఒకే చోట రిజిస్ట్రేషన్ ద్వారా 1,00,250 ఓట్లు దొంగిలించారని రాహుల్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈసీఐ డేటా ఆధారంగా 70 సంవత్సరాల ఓటరు శకున్ రాణి రెండుసార్లు ఓటు వేశారన్న రాహుల్ ఆరోపణలపై నోటీసుల్లో పేర్కొంది. సీఈవో కార్యాలయం ప్రాథమిక విచారణలో ఆమె ఒకేసారి మాత్రమే ఓటు వేసిందని పేర్కొంది. శకున్ రాణి లేదంటే.. మరెవరైనా సరే రెండుసార్లు ఓటు వేశారని మీరు నిర్ధారించిన సంబంధిత పత్రాలను అందించాలని.. తద్వారా వివరణాత్మకంగా విచారణ చేపట్టవచ్చని సీఈవో అన్బుకుమార్ నోటీసుల్లో పేర్కొన్నారు.రాహుల్ గాంధీ ప్రజంటేషన్‌లో చూపించిన టిక్ మార్క్ చేసిన పత్రం పోలింగ్ అధికారి జారీ చేసిన పత్రం కూడా కాదని వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకు ఎన్నికలను ఈసీ కొరియోగ్రఫీ చేస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలోనే మహదేవపుర నియోజకవర్గంలో ఫేక్ ఓటర్ల నమోదు, ఫేక్ చిరునామాలు, ఒకే చోట బల్క్ రిజిస్ట్రేషన్ ద్వారా లక్షకుపైగా ఓట్లను దొంగిలించినట్లుగా రాహుల్ ఆరోపించారు. ఇది ఎన్నికల కమిషన్ డేటా అని.. ఈ సమాచారాన్ని ఎవరూ తిరస్కరించలేరన్నారు. అయితే, ఈసీని మరోసారి టార్గెట్ చేస్తూ votechori.in వెబ్‌సైట్‌ను లాంచ్ చేశారు. ఇందులో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# ఇస్లాంపూర్ ఇకపై ఈశ్వర్‌పూర్

### మరో ఊరికీ పేరు మార్చిన బీజేపీ పాలిత మహారాష్ట్ర సర్కార్

**ముంబయి ఆగస్టు 10 తరంగాలు**

ఇస్లాంపూర్‌ను ఈశ్వర్‌పూర్‌గా మారుస్తూ మహారాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నది. ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు వెల్లడించారు. అదేవిధంగా ఛత్రి నిజాంపూర్‌ను రారుగడ్‌వాడీ మార్చనున్నట్టు తెలిపారు. ఇస్లాంపూర్ పేరును మార్చాలని హిందూ సంఘాలు 1980 నుంచి డిమాండ్ చేస్తున్నాయి. అదేవిధంగా ఛత్రపతి శివాజీ రాజ్యానికి రాజధానిగా ఉన్న ఛత్రి నిజాంపూర్ పేరును మార్చాలని స్థానిక ఎమ్మెల్యేలు గతకొంతకాలంగా కోరుతున్నారు.ఔరంగాబాద్, ఉస్మానాబాద్ జిల్లాల పేర్లను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే నేతృత్వంలోని గత ప్రభుత్వం మార్చిన విషయం తెలిసిందే.




ఔరంగాబాద్‌ను ఛత్రపతి శంభాజీ నగర్‌గా, ఉస్మానాబాద్‌ను ధారాశివ్‌గా మార్పుచేసింది. అయితే ఈ జిల్లాల పేర్లను మార్చాలని ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అఘాధ ప్రభుత్వం 2022 జూన్‌లో నిర్ణయించింది. ఉద్ధవ్ మంత్రివర్గం ఔరంగాబాద్‌ను శంభాజీ నగర్‌గా మార్చాలని నిర్ణయించగా, శిండే ప్రభుత్వం దీనికి ఛత్రపతి శంభాజీ నగర్ అని పేరు పెట్టింది. అదేవిధంగా 2020లో అప్పటి ప్రభుత్వం బాంబే సెంట్రల్ స్టేషన్ పేరును శంకర్‌షేత్ ముర్కుటేగా మార్చింది.

# ఈఆర్‌సీలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయా..?

**సుప్రీంకోర్టు సూటి ప్రశ్న**
**ప్రజల కోసమే విద్యుత్ అని స్పష్టీకరణ**
**నాణ్యమైన సరఫరా, అందుబాటులో ధరలు**
**ఇవే ఈఆర్‌సీల విధులు**
**డిస్కంల రెగ్యులేటరీ ఆస్తిని**
**మూడేండ్లలోపు రద్దు చేయాలి**

**న్యూఢిల్లీ ఆగస్టు 10 తరంగాలు**

విద్యుత్ నియంత్రణ కమిషన్లు (ఈఆర్‌సీలు) స్వతంత్రంగా పనిచేస్తున్నాయా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రెగ్యులేటరీ ఆస్తుల నిర్వహణ, ఖర్చు రికవరీలో జాప్యానికి వ్యతిరేకంగా ఢిల్లీ విద్యుత్ నియంత్రణ కమిషన్ (డీఈఆర్‌సీ), విద్యుత్ అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఏపీటీఈఎల్)ను సవాల్ చేస్తూ బీఎస్‌ఈఎస్ రాజధాని పవర్ లిమిటెట్, ఇతర భాగస్వామ్యులు వేసిన పిటిషన్ విచారణలో భాగంగా జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఈ ప్రశ్న వేసింది. ప్రజల కోసమే విద్యుత్ అని స్పష్టం చేసింది. సమాజంలో అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, అందుబాటులో ధరలు లభించేలా చూడ్డమే విద్యుత్ నియంత్రణ కమిషన్ల (ఈఆర్‌సీలు) విధులని కొన్ని రోజుల క్రితం ఇచ్చిన తీర్పులో పేర్కొంది. ఇందులో భాగంగా ప్రభుత్వాలతో కలిసి పని చేయాలని తెలిపింది. 2003 విద్యుత్ చట్టం ప్రకారం ప్రజాప్రయోజనాల కోసం విద్యుత్‌ను విక్రయించడం, పంపిణీ చేయడం, మార్కెట్ శక్తుల ప్రభావం లేకుండా చూసుకోవడానికి విద్యుత్ నియంత్రణ కమిషన్లు (ఈఆర్‌సీలు)ను ఒక రక్షణ కోటగా పనిచేయడానికి ఉద్దేశించారని సుప్రీంకోర్టు వెల్లడించింది. కానీ.. ఈఆర్‌సీలు ఈ విధంగా పని చేస్తున్నాయా.. అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాగే, చట్ట ప్రకారం తమకు కల్పించబడిన స్వతంత్రత, స్వయం ప్రతిపత్తికి అనుగుణంగా ఈఆర్‌సీలు పనిచేయడంపై సుప్రీంకోర్టు సందేహం వ్యక్తం చేసింది. విద్యుత్ టారిఫ్‌లను నిర్ణయించడంలో ఈఆర్‌సీలు ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటాయని గుర్తు చేసింది.



చట్ట ప్రకారం ఇఆర్‌సిలు నిర్ణయించిన విద్యుత్ టారిఫ్‌లు సరఫరా ఖర్చును ప్రతిబింబించాలని, క్రాస్ సబ్సీడీలను తగ్గించాలని తెలిపింది. కానీ.. విద్యుత్ పంపిణీ కంపెనీల రెగ్యులేటరీ ఆస్తిని చట్టం అంగీకరించిన పరిమితికి మించి అనుమతించడం ద్వారా, విద్యుత్ టారిఫ్‌లను భారీగా పెంచడానికి ఈఆర్‌సీలు ఒక 'నిర్వహణ, యుక్తి' వ్యూహాలను అనుసరిస్తున్నాయని సుప్రీంకోర్టు విమర్శించింది. విద్యుత్ టారిఫ్‌లు నిర్ణయించడానికి కీలకమైన విద్యుత్ పంపిణీ సంస్థల రెగ్యులేటరీ ఆస్తిని కొన్ని దశాబ్దాలుగా లిక్విడేట్ చేయడానికి, రద్దు చేయడానికి ఈఆర్‌సీలు ఉద్దేశ పూర్వకంగానే అనుమతించడం లేదని, కాబట్టి ఈ రెగ్యులేటరీ ఆస్తి అనేది గాలి బుడగలాగా మారిందని, దీంతో ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లితోందని,, విద్యుత్ కోసం ఎక్కువ ధరల భారాన్నీ వారు భరించాల్సి వస్తోందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇక నుంచి భవిష్యత్‌లో విద్యుత్ పంపిణీ సంస్థల రెగ్యులేటరీ ఆస్తిని మూడేళ్లలోపు రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆస్తులను గరిష్టంగా ఏడేండ్లలోపు లిక్విడేట్ చేయాలని స్పష్టం చేసింది.

తరంగాలు
జాతీయ దిన పత్రిక
RNI . TELTEL / 2022 / 83463
Tharangalu Daily News Paper

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి





**-జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నల్గొండ ఆర్సిఆగస్టు 10,తరంగాలు:** నల్గొండ ప్రభుత్వ ప్రధానాస్పత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు.ఆదివారం ఆమె ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

క్యాజువాలిటీ, ఐసీయూ, ఏ ఎం సి యు,సర్జికల్ వార్డు, మెడికల్ వార్డ్, రేడియాలజీ,తదితర విభాగాలను తనిఖీ చేసి డాక్టర్లు,నర్సులతో మాట్లాడి ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవల పై ఆరా తీశారు. ఐసీయూ,రేడియాలజీ, తదితర విభాగాలలో ఎంత మంది పేషెంట్స్ ఉన్నారని? ఐ సి లో ఎన్ని బెడ్లు ఉన్నాయని ?అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులతో ప్రధాన ఆస్పత్రికి వస్తున్న వారి వివరాలను సైతం జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రేడియాలజీ విభాగం ద్వారా రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రేడియాలజీ విభాగం దూరంగా ఉన్నందున నడవలేని పేషెంట్లకు మొబైల్ ఎక్స్ రే యూనిట్ ద్వారా ఎక్స్ రే తీయించడం జరుగుతుందని, నడవగలిగే వారిని వీల్ చైర్ మీద రేడియాలజీ కి తీసుకెళ్తున్నట్లు డాక్టర్లు తెలిపారు.అన్ని విభాగాలు పరిశీలించిన తర్వాత మందులు, వైద్య సేవలు, టెస్టులు, ఇతర పరీక్షల పై జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో అవసరమైన అన్ని వైద్య పరికరాలు, సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు .ప్రత్యేకించి నిరంతర వర్షాల వలన సీజనల్ వ్యాధులతో ఎక్కువమంది ఆసుపత్రికి వస్తున్నారని, వారందరికీ తగిన వైద్య చికిత్సలు అందించేలా డాక్టర్లు ,సిబ్బంది, నర్సులు అందుబాటులో ఉండాలని, మందులు ఇతర ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా ఆమె ఆదేశాలు జారీ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో సైతం ఎలాంటి నిర్లక్ష్యం,ఇబ్బంది లేకుండా రోగులకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలని చెప్పారు.డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్ వర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వర్ ,ఆర్ ఎం ఓ కిరణ్ కుమార్, టి ఎస్ ఎం ఐడిసి రాజశేఖర్, జితేందర్, తదితరులు ఉన్నారు.

# యువత నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకుంటేనే భవిష్యత్తులో అనుకున్నది సాధించవచ్చు

**ఫాదర్ విజయపాల్ రెడ్డి**




**హన్మకొండ ప్రతినిధి, ఆగస్టు 10,తరంగాలు :** యువతీ,యువకులు జీవితంలో ఏ వయసులో ఉన్న వారైనా మొదటగా దేవుడికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆ తర్వాతే మిగతా కార్యక్రమాలకి ప్రాధాన్యత ఇవ్వాలని డియోసిస్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ డి.విజయపాల్ రెడ్డి అన్నారు.ఫాతిమా నగర్ లోని యూత్ సెంటర్ లో నేషనల్ యూత్ సండే కార్యక్రమాన్ని అరుణోదయ యూత్ డైరెక్టర్ పొలిమేర సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డియోసిస్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ డి.విజయపాల్ రెడ్డి హాజరై యువతీ యువకుల నుద్దేశించి ప్రసంగించారు.ముఖ్యంగా యువత సంస్కారాన్ని మరచిపోయి గౌరవ మర్యాదలను విస్మరిస్తున్నారని ఇలాంటి పరిస్థితుల్లో దేవుడి సన్మార్గంలో పయనిస్తే భవిష్యత్తుకు నిలకడ ఉంటుందన్నారు.పోటీ ప్రపంచంలో యువత అనుకున్న నిర్దేశాలను సాధించలేని పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ విషయంపై తల్లిదండ్రులు గురువులు హిత బోధనలను చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు కనబడటం లేదన్నారు.నేర్చుకోవడం అనేది మానవుడు తల్లి గర్భంలోనున్నప్పుడే నేర్చుకున్నాడని తెలుపుతూ అన్ని నేర్చుకున్న వాడిగా, తెలిసినవాడిగా విర్రవీగకుండా నిత్యం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచిస్తూ ఆరంభముతో పాటు అంతము వరకు ఉంటుందన్నారు.ఇలాంటి తరుణంలో ప్రతిరోజు, ప్రతిక్షణం నేర్చుకుంటూనే ఉండాలన్నారు.ప్రపంచంలో ఏ వ్యక్తి కూడా దేనిని నేర్చుకోవాల్సిన అవసరం లేదు సమస్తము నాకు తెలుసు అని ఎవరైనా చెప్పగలరా అని ప్రశ్నించారు.ఎవరు చెప్పలేరన్నారు.దేవుడు మనకు ఇచ్చినటువంటి టాలెంట్ ని సద్వినియోగ పరుచుకోవాలన్నారు. మంచికి ఉపయోగించాలి చెడుకు కాకుండా దేవుడు మనకు ఇచ్చింది దాచి పెట్టుకోవడానికి కాకుండా వాటిని మంచికి ఉపయోగించమని సూచించారు.రానున్న రోజుల్లో యువత ఏసుక్రీస్తు నామాన్ని స్మరించుకుంటూ తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సులభతరం చేసుకోవాలని ఆయన తెలిపారు.ఇలాంటి యూత్ కార్యక్రమాలను దశల వారీగా నిర్వహించి మరింత ఎక్కువమంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనే విధంగా జూబ్లీ సెలబ్రేషన్స్ కు సిద్ధం కావాలని సూచించారు.ఈ

# మృతుల కుటుంబాలకు పెద్ది పరామర్శ





**నర్సంపేట ఆగస్టు 11 తరంగాలు :** నర్సంపేట పట్టణంలో వివిధ కారణాలతో మరణించిన పలువురి మృతుల కుటుంబ సభ్యులను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం పరామర్శించారు ఈ సందర్భంగా పట్టణంలోని కాకతీయ నగర్ కు చెందిన బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు తోట బిక్షపతి ఇటీవల మరణించగా వారి దశదిన కార్యక్రమానికి పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై బిక్షపతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు అనంతరం పట్టణంలోని ప్రముఖ వ్యాపారి బూర అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబ సభ్యులను పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు రాయిడి దుష్యంత్ రెడ్డి మాజీ కౌన్సిలర్లు మండల శ్రీనివాస్ తో పాటు పలువురు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఉప్పరపల్లి గ్రామంలో ఘనంగా పోచమ్మ బోనాలు..







**చెన్నారావుపేట,ఆగస్టు 10, (తరంగాలు)** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో పోచమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తరంగాలు రిపోర్టర్ పోగుల అశోక్-సంధ్యారాణి దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ప్రజలు వారి ఇంటి దగ్గర నుండి పోచమ్మ తల్లికి బోనాన్ని ఎత్తుకొని డప్పు సప్పులతో డీజే పాటలతో పోచమ్మ గుడికి వెళ్లి మొక్కలు చెల్లించారు. పోచమ్మ తల్లి దీవెనలు ఎల్లవేళలా ఉంటూ పాడిపంటలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రజలు కోరుకున్నారు.ఈ సందర్భంగా పోచమ్మ గుడి కి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి పోచమ్మ తల్లి దర్శించుకుని, ముగ్గురు చెల్లించుకున్నారు.

# నూతన టీ వరల్డ్ ను ప్రారంభించిన నర్సంపేట శాసనసభ్యులుఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నర్సంపేట ఆగస్టు 10 (తరంగాలు)** చెన్నారావుపేట మండలానికి చెందిన కేశపాక వంశీ నర్సంపేట పట్టణంలోని నెక్కొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసుకున్న టీ వరల్డ్ షాపును ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డినర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు.మరియు చెన్నారావుపేట మండల యువ నాయకుడు వట్టే. శ్రీనివాస్ రెడ్డి. చెన్నారావుపేట మరియు నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నే బోయిన. రమేష్ తదితరులు పాల్గొన్నారు

# బిజెపిలో యువతకు పెద్దపీట

**గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**



**నర్సంపేట ఆగస్టు 11 తరంగాలు :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గం లో యువతకు అత్యధిక సీట్లు కేటాయించి పెద్దపీట వేయనున్నట్లు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి వెల్లడించారు ఆదివారం పట్టణంలో బిజెపి పార్టీ కార్యాలయంలో చెన్నారావుపేట మండలం జీడిగడ్డ తండాకి చెందిన వివిధ పార్టీల యువకులు మండల పార్టీ అధ్యక్షుడు దామరప్పుల శేఖర్ మరియు భూక్య నవీన్ ఆధ్వర్యంలో గుగులోతు అరుణ్ భూక్య సుమన్ గుగులోతు నటరాజ్ ఆంగోతు ప్రశాంత్ భూక్య రాకేష్ బానోతు రాజ్ కుమార్ లు బిజెపిలో చేరారు వీరికి రాణా ప్రతాప్ రెడ్డి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కానీ ఏ ఒక్క హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. తెలంగాణలో యువత ముందు నడిచి రాబోయే రోజుల్లో కాషాయ జెండా ఎగరవేయాలని తద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు పార్టీలో చేరిన ప్రతీ ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ రంజిత్ ప్రధాన కార్యదర్శి మురహరి విజయ్ భూక్య హరీష్ భూక్య వినోద్ భూక్య రాజేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ,మానవత్వం చాటుకున్న ఆటో డ్రైవర్





**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 10,తరంగాలు:** రోడ్డుపైన 100 రూపాయలు దొరికితే తిరిగి ఇవ్వని సమాజంలో నిజాయితీ మరియు మానవత్వం ఉన్న మంది ఇంకా ఉన్నారు అంటే దానికే ఉదాహరణ ఆటో డ్రైవర్ సలీం.వరంగల్ లో నివసిస్తున్న ఎండీ . సలీం ఆటో డ్రైవర్ గా జీవనాన్ని సాగిస్తున్నాడు.శనివారం అతనికి వరంగల్ నుండి హనుమకొండ కు రాపిడో బుకింగ్ వచ్చింది.బుకింగ్ చేసిన యువతిని తన గమ్య స్థానం చేర్చాక మరొక పాసెంజర్ ఎస్కె షరీఫ్ . ఎక్కారు.ఆ సమయంలో సదరు ప్యాసెంజర్ ఆ యువతీ మరిచిపోయిన పర్సును ఆటో డ్రైవర్ కు ఇవ్వగా ఆటో డ్రైవర్ సలీం ఆ పర్సు తనది కాదని చెప్పగా ప్యాసెంజర్ ఎస్ కే . షరీఫ్ మరియు ఆటో డ్రైవర్ సలీం హనుమకొండ పోలీస్ స్టేషన్ లో పోలీసులకు ఆ పర్సును అందచేశారు. సాయంత్రం మరల ఆ యువతీ రాపిడో కస్టమర్ సర్వీస్ కు కాల్ చేసి ఆటో డ్రైవర్ కాంటాక్ట్ నెంబర్ తీసుకొని డ్రైవర్ ను సంప్రదించగా ఆమె పర్సు ను హనుమకొండ పోలీస్ స్టేషన్ లో ఇచ్చానని అక్కడికి వచ్చి తీసుకోమని చెప్పారు . యువతీ హనుమకొండ పోలీస్ స్టేషన్ ను సంప్రదించగా పోలీస్ లు తగిన ఎంక్వైరీ చేసారు అందులో ఆమె 2 తులాల బంగారం ఉందని ఆమె చెప్పగా పోలీసులు ఆమె చెప్పిన గుర్తులు అన్ని సరిగా ఉన్నాయని పరిశీలించి ఆ బంగారాన్ని ఆమెకు అందజేశారు.మరియు ఆటో డ్రైవర్ సలీం నిజాయితీని ఎస్సై సతీష్ ఏయస్ ఐ రఘునా రెడ్డి మరియు పోలీసులు మెచ్చుకున్నారు.

# ఘనంగా బోనాల జాతర

## విద్యుత్ కాంతులతో ముత్యాలమ్మ ఆలయం



**నర్సింహులపేట ఆగస్టు 10 తరంగాలు నర్సింహులపేట**
మండల కేంద్రంలో ఘనంగా బోనాల పండుగను గ్రామ ప్రజలు అందరు కలిసి జరుపుకున్నారు. బోనాల పండుగ శ్రావణ మాసంలో నరసింహుల పేట మండల కేంద్రంలో తోపాటు వివిధ గ్రామాలో జరుపుకోవడం ఈగ్రామంలో విశేషం. గ్రామ బొడ్రాయి వద్ద ఉదయం పూజలు, అమ్మవార్లకు ధూప,దీప నైవేద్యాలను . గ్రామాల్లో గ్రామదేవతలు దుర్గమ్మ, ఎల్లమ్మ, పోశమ్మ, మైసమ్మ, నల్లపోచమ్మ, కట్టమైసమ్మ, పెద్దమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ, మారెమ్మ, పోలేరమ్మలను గ్రామాలల్లో భక్తులు దేవాలయల్లో కొలువుంచుకొన ప్రత్యేక పూజలు చేసినారు.బోనం అంటే భోజనం. జానపదులు తమకు ఇష్టమైన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించడమే బోనం. వండిన అన్నంతో పాటు పాలు, బెల్లం, కొన్ని మార్లు ఉల్లిపాయలతో కూడిన బోనాన్ని అమ్మవారికి సమర్పిస్తారు.గ్రామాలో గ్రామదేవతల ఆలయాలన్నీ మామిడి కొమ్మలు, అరటి మండలు, దీపాల కాంతులతో అలంకరిస్తారు. అమ్మవారికి బోనం వండడానికి ఎక్కువగా మట్టి కుండలే వాడుతుంటారు. కొత్తకుండను తెచ్చి, కట్టెల పొయ్యి మీద బోనం వండడం ఆనవాయితీ. బోనం వండిన తరువాత బోనం కుండను శుభ్రం చేసి సున్నం రాసి, పసుపు,కుంకుమలతో అలంకరిస్తారు. చుట్టూ పూలమాలను అలకరించి మహిళలంత బోనాల పండుగ చాలా ఆనందంగా ఉంది అంటూ గ్రామస్తులు ప్రజాప్రతినిధులు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో పి రాధిక. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జీనుకల రమేష్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు ద్రసు నాయక్ నాయక్. గ్రామ పార్టీ అధ్యక్షులు రామకృష్ణ, రజనీకాంత్ రెడ్డి. వెన్నం రవీందర్ రెడ్డి. మండల ప్రధాన కార్యదర్శి ఎర్రనాగి రమేష్. మండల యూత్ అధ్యక్షులు పొన్నం శ్రీకాంత్ డోర్నకల్ యూత్ ప్రధాన కార్యదర్శి రేఖ అనిల్, కాశ యాకయ్య. గౌని యాదగిరి. అల్వాల శ్రీనివాస్. పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు. శివకుమార్ ముత్యాలమ్మఅమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు

# రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి.

**తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ**



**హైదరాబాద్,ఆగస్టు 10, తరంగాలు:**
హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ఆగస్టు 12న జరిగే తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర రెండవ మహాసభకు మాదిగ అనుబంధ కులాల జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ కోరారు. ఆదివారం హైదరాబాదులో ఆయన విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు తమ జర్నలిస్ట్ ఫోరం పోరాటాలు చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం జర్నలిస్టులకి అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఇంటి స్థలాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని న్యాయనిపుణులతో చర్చించి కోర్టు పరిధిలో ఉన్న సమస్యను పరిష్కరించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రభుత్వం వెంటనే ప్రారంభించి మొదటి దశలో మాదిగ అనుబంధ కులాల జర్నలిస్టులకు అవకాశం కల్పించి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించేందుకే మాదిగ జర్నలిస్ట్ ఫోరం మహాసభలు నిర్వహిస్తుందని చెప్పారు.

# 12 న మాదిగ జర్నలిస్ట్ ల ఛలో హైదరాబాద్

**-మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర 2వ మహా సభ ను విజయవంతం చేద్దాం**
**-టీఎంజెఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెండ్యాల సుమన్**



**పరకాల ఆగస్టు 10 తరంగాలు**
ఆదివారం రోజున పరకాల లో మాదిగ జర్నలిస్ట్ ఫోరం సమావేశం మడికొండ పవసన్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా టీఎంజెఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెండ్యాల సుమన్ మాట్లాడుతూ ఈ నెల 12న జర్నలిస్టుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర 2వ మహా సభను విజయవంతం చేయాలని తెలిపారు కార్యక్రమంలో టీఎంజెఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడెపాక భాస్కర్, టీఎంజెఫ్ జిల్లా నాయకులు శ్రీను చుక్క సతిష్ పరకాల మండల అధ్యక్షుడు మడికొండ పవన్ రవి చంద్ర తదితరులు పాల్గొన్నారు

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 10,(తరంగాలు ):**
మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామానికి చెందిన గాలి రాణి, తుమ్మ అన్నమ్మ తల్లి కూతుర్లు ఇటీవల దారుణ హత్యకు గురికాగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇలాంటి దారుణమైన సంఘటన జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. జరిగిన ఘటనకు సంబందించిన విచారణను వేగవంతం చేయాలనీ, హంతకులను వెంటనే గుర్తించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వీలైనంత తొందరలో నిందితులను గుర్తించి కఠిన శిక్ష పడే విధంగా చూస్తానని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రాడపాక కనకయ్య ఇటీవల మరణించగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, మాజి ఎంపీపీ సుదర్శన్, మాజీ సర్పంచ్ అనిత సుధాకర్ బాబు, రమేష్ గౌడ్, దానియల్, సోంనారాయణ స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జే చొక్కారావు దేవాదుల ప్రాజెక్ట్ సమీక్షా సమావేశం






## పాల్గొన్న ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 10,తరంగాలు:**
ములుగు జిల్లా పరిధి లోని తుపాకుల గూడెం జే చోక్కారావు దేవాదుల పంపు హౌస్ వద్ద రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జే. చొక్కారావు దేవాదుల ప్రాజెక్ట్ సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకాటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దొంతి మాధవ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, మురళి నాయక్ తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ జే చొక్కారావు దేవాదుల ప్రాజెక్ట్ కింద ఆయకట్టు గణనీయంగా పెరిగింది. పెరిగిన ఆయకట్టుకు సరిపడా నీటి కేటాయింపులు లేవు నీటిని ఎత్తిపోయడానికి వాడుతున్న మోటార్లు పాత పడడం వల్ల తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. మోటర్ల సమస్యల వల్ల పూర్తి స్థాయిలో నీటిని పంపు చేయలేకపోతున్నాం.ప్యాకేజీ 6కింద స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, పాలకుర్తి, తుంగతుర్తి నియోజకవర్గాలలో సుమారు 78వేల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉంది. నా వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే విధంగా కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కోరారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్, నీటి పారుదల శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనావత్ రాధని పరామర్శించిన

**మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్**






**మహబూబాబాద్ ఆగస్టు 10 తరంగాలు**
మహబూబాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనావత్ రాధ గారి భర్త జె డి ఏ వీరు నాయక్ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఆదివారం స్వగ్రామం అయిన గూడూరు మండల రాములు తండాకు వెళ్లి నూనావత్ రాధని పరామర్శించిన మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ పోరిక బలరాం నాయక్ అనంతరం వీరు నాయక్ చిత్రపటానికి పూలమాల చేసి నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎంపీ బలరాం నాయక్ తో పాటు టిపిసిసి ఉపాధ్యక్షులు నామిండ్ల శ్రీనివాస్,గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి స్వామి,గూడూరు మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్ నాయక్,గూడూరు మండల సీనియర్ నాయకులు మాధవపెద్ది అమరేందర్ రెడ్డి,మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు యాకుబ్ పాషా,బయ్యారం పిఎసిఎస్ డైరెక్టర్ జూలకంటి సీతారాం రెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ నాయక్ ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ అన్సారీ,అప్పారాజుపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు భరత్ నాయక్,మాలోత్ అరుణ్ నాయక్,హస్సేన్,సతీష్ తదితరులు ఉన్నారు...

# నూతన వధూవరులను ఆశీర్వదించిన రాణా ప్రతాప్



**నర్సంపేట ఆగస్టు 11 తరంగాలు :**
నర్సంపేట పట్టణంలోని పద్మశాలి గార్డెన్ లో ముస్కుల శోభ మల్లారెడ్డి దంపతుల కుమారుడు ముస్కుల వినోద్ రెడ్డి సింధుజ ల వివాహం ఆదివారం జరగగా బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గూడూరు సందీప్ చెన్నారావుపేట మండల పార్టీ అధ్యక్షుడు దామరప్పుల శేఖర్ జిల్లా కౌన్సిల్ మెంబర్ రంజిత్ కీసరి సాంబరాజు మురహరి విజయ్ తో పాటు తదితరులు ఉన్నారు.


# నూతన వధూవరులను ఆశీర్వదించిన పెద్ది



**నర్సంపేట ఆగస్టు 11 తరంగాలు :**
నర్సంపేట పట్టణానికి చెందిన మాంటిస్సోరి స్కూల్ చైర్మన్ ఎర్ర జగన్ మోహన్ రెడ్డి మనవరాలు ప్రియాంక రెడ్డి జీవన్ రెడ్డి ల వివాహం హనుమకొండలోని ఎస్ వి కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరగగా వారి వివాహానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వధూవరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఉన్నారు.

## బిజినెస్

### ముఖేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ కారు ఖరీదు రూ. 100 కోట్లు.. దాని ఫీచర్లు తెలిస్తే మైండ్‌బ్లాక్?



భారతదేశంలో అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ. దేశంలోనే అపర కుబేరుడైన ముఖేష్ అంబానీ దగ్గర అత్యంత ఖరీదైన కారు ఉంటుందని చాలా మంది అనుకుంటారు. కానీ, భారతదేశంలో అత్యంత ఖరీదైన కారు ముఖేష్ అంబానీ సతీమణి, వ్యాపారవేత్త నీతా అంబానీ సొంతం అని మీకు తెలుసా..? ఈ కారు లక్షణాలు, శక్తివంతమైన ఇంజిన్ గురించి తెలుసుకుందాం.అంబానీ కుటుంబం వద్ద చాలా ఖరీదైన కార్లు ఉన్నాయి. కానీ దేశంలో అత్యంత ఖరీదైన కారు ఆడ□A9 చామెలియన్. ఈ కారు యజమాని నీతా అంబానీ. నీతా అంబానీ దగ్గర దేశంలోనే అత్యంత ఖరీదైన కారు ఉంది. దీని ధర దాదాపు అక్షరాల రూ. 100 కోట్లు. ఈ ఆడి కారు దాదాపు 600 హార్స్‌పవర్ శక్తివంతమైన ఇంజిన్‌తో మార్కెట్లో అందుబాటులో ఉంది.ఈ ఆడి కారు ప్రత్యేకతను పరిశీలిస్తే, దాని అతిపెద్ద ప్రత్యేకత ఏమిటంటే, ఈ కారు రంగును కేవలం ఒక బటన్ నొక్కితే మార్చువచ్చు. ఈ కారు పెయింట్ స్కీమ్ విద్యుత్తుతో తయారు చేయడం జరుగుతుంది. అదే సమయంలో, ప్రపంచవ్యాప్తంగా 11 కార్లు మాత్రమే అమ్ముడయ్యాయిఆడి A9 చామెలియన్‌లో కంపెనీ 4.0 లీటర్ V8 ఇంజిన్‌ను అందించింది. ఈ ఇంజిన్ గరిష్టంగా 600 HP శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అంతే కాకుండా, ఈ కారులో రెండు డోర్లు మాత్రమే రూపొందించారు. ఈ కారు పొడవు దాదాపు 5 మీటర్లు.ఈ కారు విండ్‌షీల్డ్, రూఫ్‌ను ఒకదానిలో ఒకటిగా అనుసంధానించారు. అంతేకాకుండా, ఈ లగ్జరీ కారులో మరే ఇతర కారులోనూ కనిపించని అనేక ఆధునిక ఫీచర్లు అందించారు.ఈ కారు విండ్‌షీల్డ్, రూఫ్‌ను ఒకదానిలో ఒకటిగా అనుసంధానించారు. అంతేకాకుండా, ఈ లగ్జరీ కారులో మరే ఇతర కారులోనూ కనిపించని అనేక ఆధునిక ఫీచర్లు అందించారు

## బాబోయ్.. భారీగా పెరిగిన బంగారం ధరలు.. తెలుగు రాష్ట్రాల్లో రేట్లు ఎలా ఉన్నాయంటే..

బంగారం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి.. ఏకంగా లక్షమార్కు దాటిన పసిడి ధరలు.. నాన్‌స్టాప్‌గా పెరుగుతూనే ఉన్నాయి.. ఏకంగా లక్షా 3 వేల రూపాయల మార్క్ దాటిన.. స్వచ్ఛమైన పసిడి ధర సరికొత్త రికార్డును తిరగరాసింది. ఇక వెండి ధర కూడా అదే స్థాయిలో భారీగా పెరిగింది. కాగా.. ఆదివారం (ఆగస్టు 10) ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి.. ఆగస్టు 10 2025 ఉదయం ఆరు గంటలకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. **దేశియంగా బంగారం, వెండి రేట్లు ఇలా ఉన్నాయి.**

24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర 1,03,040 గా ఉంది.

22 క్యారెట్ల పసిడి పది గ్రాముల ధర రూ.94,450 గా ఉంది.

వెండి ధర కిలో ధర రూ.1,17,000 లుగా ఉంది.

అయితే, ప్రాంతాల వారిగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.



**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,03,040 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.94,450 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,27,000 గా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,03,040, 22 క్యారెట్ల ధర రూ.94,450 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,27,000 గా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,03,190, 22 క్యారెట్ల ధర రూ.94,600 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,17,000 లుగా ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,03,040, 22 క్యారెట్ల ధర రూ.94,450 ఉంది. వెండి ధర కిలో రూ.1,17,000 గా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,03,040 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.94,450 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,27,000 లుగా ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,03,040, 22 క్యారెట్ల ధర రూ.94,450 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,17,000 లుగా ఉంది.

## లాభాల్లో భారత్‌పే


**న్యూఢిల్లీ,**

దేశీయ ఫిన్‌టెక్ కంపెనీ భారత్‌పే లాభాల్లోకి వచ్చింది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.6 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. అంతక్రితం ఏడాది సంస్థ రూ.342 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో సంస్థ ఆదాయం రూ.1,734 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్‌ఈకి సమాచారం అందించింది.ఈ సందర్భంగా కంపెనీ సీఈవో నలిన్ నేగి మాట్లాడుతూ..గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను తిరిగి లాభాల్లోకి రాగలిగామని, గత కొన్ని నెలలుగా నిలకడైన వృద్ధిని నమోదు చేసుకుంటున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థ నెలకు 45 కోట్ల యూపీఐ లావాదేవీలు ప్రాసెసింగ్ చేస్తున్నదన్నారు.




## టీ20లో అత్యధిక సిక్సర్లు.. వార్నర్ 16 ఏళ్ల రికార్డు బ్రేక్.!


పొట్టి క్రికెట్‌లో సంచలనంగా మారిన టిమ్ డేవిడ్ మరో రికార్డు బ్రేక్ చేశాడు. ఆస్ట్రేలియా తరఫున పొట్టి ఫార్మాట్‌లో రెండో వేగవంతమైన సెంచరీతో రికార్డు నెలకొల్పిన ఈ చిచ్చరపిడుగు ఈసారి డేవిడ్ వార్నర్ ను అధిగమించాడు. 16 ఏళ్లుగా డేవిడ్ భాయ్ పేరిట ఉన్న అత్యధిక సిక్సర్లు రికార్డును బద్ధలు కొట్టాడు డేవిడ్. ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో ఈ యంగ్‌స్టర్ ఈ మైలురాయికి చేరువయ్యాడు.మూడు టీ20ల సీరీస్ ఆరంభ పోరులో టిమ్ డేవిడ్ తన ఉగ్రరూపం చూపించాడు. డార్విన్‌లోని మర్రార క్రికెట్ మైదానంలో కష్టాల్లో పడిన జట్టును ఆదుకోవడమే కాదు రికార్డు బ్రేకింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. 7.4 ఓవర్లకే ఆరు వికెట్లు పడిన వేళ సఫారీ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ 52 బంతుల్లోనే 83 రన్స్ బాదాడు డేవిడ్. తన విధ్వంసక బ్యాటింగ్‌తో స్కోర్ బోర్డును ఉరికించిన ఈ యంగ్‌స్టర్ ఏకంగా ఎనిమిది సిక్సర్లు కొట్టాడు. దాంతో, ఆసీస్ పోరాడగలిగే స్కోర్



చేయగా.. ప్రొటిస్ జట్టుపై 2009లో ఆరు సిక్సర్లతో వార్నర్ నెలకొల్పిన రికార్డు కనుమరుగైంది.డేవిడ్ హస్సీ, మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్‌లు సైతం ఆరేసి సిక్సర్లతో వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. హసీ 2009లో మెల్‌బోర్న్ మైదానంలో .. 2023లో డర్బన్‌లో జరిగిన టీ20లో మార్ష్ ఈ ఘనత సాధించగా.. రెండు రోజుల్లోనే హెడ్ ఆరు సిక్సర్లతో 91 రన్స్‌తో రికార్డు సమం చేశాడు.

## డకెట్ సవాల్‌ను స్వీకరించా.. అందుకే అలా వీడ్కోలు పలికాను

అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ ఓవల్ టెస్టులో ఆకాశ్ దీప్ ప్రవర్తనపై దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ ను ఔట్ చేసిన తర్వాత.. అతడి భుజంపై చేయి వేసి మాట్లాడినందు భారత పేసర్‌పై నిషేధం విధించాలని డకెట్ కోచ్ డిమాండ్ చేస్తున్నాడు. తన ప్రవర్తన వివాదాస్పదం కావడంపై ఆదివారం ఆకాశ్ దీప్ స్పందించాడు. ఓవల్ టెస్టులో డకెట్ సవాల్ విసరడం వల్లనే తాను అలా వీడ్కోలు పలకానని.. అంతే తప్ప అందులో వేరే ఉద్దేశమేది లేదని ఆకాశ్ తెలిపాడు.సిరీస్ ఫలితాన్ని నిర్ణయించిన ఓవల్ టెస్టులో ఆకాశ్ దీప్ ఓవర్లో డకెట్ బౌండరీలతో చెలరేగాడు. బజ్ బాట్ ఆటతో చెలరేగుతూ స్కోర్ బోర్డును ఉరికించాడు. 'నువ్వు నన్ను ఔట్ చేయలేవు' అని అనడంతో ఆకాశ్ అవునా.. 'ఔట్ చేసి తీరుతాను' అనుకున్నాడు. హాఫ్ సెంచరీతో విరుచుకుపడిన అతడిని ఔట్ చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చాడు భారత



పేసర్. 'నాకు డకెట్‌పై మంచి రికార్డు ఉంది. అతడిని పలుమార్లు ఔట్ చేశాను. లెఫ్ట్ హ్యాండర్లను వెనక్కి పంపడం అంటే నాకిష్టం. డకెట్ ఏమీ ప్రత్యేకం కాదు. కానీ, ఆ రోజు మాత్రం అతడు నా లైన్ అండ్ లెంగ్త్‌ను దెబ్బతీశాడు. సహజమైన షాట్లకు బదులు రివర్స్ స్వీప్, స్వీప్ షాట్లతో నాపై పైచేయి సాధించాడు. అంతేకాదు 'ఈ రోజు నాది. నువ్వు నన్ను ఔట్ చేయలేవు' అని నాతో అన్నాడు.అతడి మాటలు విన్నాక నాలో మరింత కసి పెరిగింది. అలానా అయితే చూద్దాం అనుకున్నా. 'నువ్వు మిస్ అయితే నేను వికెట్ల పడగొడుతా' అని డకెట్‌తో చెప్పాను. అలా చెప్పినట్టే.. అతడి వికెట్ తీశాను. ఇంగ్లిష్ ఓపెనర్ నిరాశగా పెవిలియన్ వెళ్తుంటే అతడి భుజంపై వేసి.. ప్రతిసారి నువ్వు విజయం సాధించలేవు. ఈసారి నేను గెలిచాను అని సరదాగా అన్నాను. నా మాటల్ని డకెట్ కూడా స్పోర్టివ్‌గానే తీసుకున్నాడు' అని తమ ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను ఆకాశ్ వెల్లడించాడు.భారత జట్టు రెండో ఇన్నింగ్స్‌లో నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్.. అద్భుతమైన ఆటతో అలరించడమే కాదు టెస్టుల్లో తొలి అర్ధ శతకం సాధించాడు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు విలువైన 107 రన్స్ జోడించాడీ స్పీడ్‌గన్. ఇంగ్లండ్ పర్యటనలో 13 వికెట్లతో రాణించిన ఆకాశ్ స్వదేశం వచ్చాక తన డ్రీమ్ కారు కొన్నాడు. రాఖీ పండుగ రోజున తన సోదరీమణులతో కలిసి టయోటా ఫార్చునర్ కారు కొనుగోలు చేశాడీ పేసర్.


## స్పోర్ట్స్

### ఐదు రోజుల్లో డైమండ్ లీగ్.. నీరజ్, నదీమ్ పోరు లేనట్టేనా..!



పారిస్ ఒలింపిక్స్ తర్వాత భారత బడిసె వీరుడు నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్ ఎదురుపడింది లేదు. త్వరలోనే సెలేసియా డైమండ్ లీగ్ లో దాయాది అథ్లెట్లు 'నువ్వానేనా' అన్నట్టు జావెలిన్‌ను విసురుతారని అభిమానులు అనుకున్నారు. కానీ, నిర్వాహకులు ప్రకటించిన తొలి జాబితాలో ఇద్దరి పేర్లు లేకపోవడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు.ఆగస్టు 16 న సెలిసియా డైమండ్ లీగ్ మొదలవ్వనుంది. టోర్నీకి మరో ఐదు రోజులే ఉండడంతో ఆదివారం నిర్వాహకులు అథ్లెట్ల జాబితాను వెల్లడించారు. అందులో నీరజ్, అర్షద్‌ల పేర్లు మాత్రం లేవు. జులియన్ వెబర్, జులియస్ ఎగో, అండర్సన్ పీటర్స్ వంటి స్టార్లు బరిలో ఉన్నట్టు ఆర్గనైజర్స్ తెలిపారు. అయితే.. జూలైలోనే ఈ లీగ్ షెడ్యూల్ వచ్చింది. దాంతో.. యూరప్‌లో జరుగబోయే ఈ టోర్నీలో నీరజ్, నదీమ్‌ల మధ్య హోరాహోరీ బడిసె ఫైట్ ఉంటుందని భావించారంతా. కానీ, అధికారిక జాబితాలో చోప్రా పేరు లేకపోవడంతో అతడు ఈ టోర్నీలో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి.పాక్ అథ్లెట్ నదీమ్ ఈమధ్యే లండన్‌లో కాలిపిక్క కండరాలకు సర్జరీ చేయించుకున్నాడు. ప్రస్తుతం కోలుకుంటున్న అతడు ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ మీద దృష్టిసారించాడని అతడి కోచ్ సల్మాన్ భట్ వెల్లడించాడు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా 'నీరజ్ చోప్రా క్లాసిక్' లో నదీమ్ పోటీపడలేదు. ఆ తర్వాత 90 మీటర్ల మార్క్ అందుకొని చోప్రా విజేతగా నిలిచిన జరిగిన 'దోహా డైమండ్ లీగ్'లోనూ నదీమ్ పాల్గొనలేదు.తలపడేది వీళ్లే.. జులియన్ వెబర్ (జర్మనీ), జులియస్ ఎగో(కెన్యా), రొడ్రిక్ జెన్కి డీన్ (జపాన్), అండ్రియాన్ మర్దారే(మాల్డోవా), సిప్రియన్ రిజ్‌గోల్డ్ (పోలాండ్), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), కెశొర్న్ వాల్‌కాట్(ట్రినిడాడ్ టొబాగో).





## వార్ 2: కియారా బికినీ సీన్‌ని

# తొలగించిన సెన్సార్ బోర్డు

అగ్రనటులు ఎన్.టి.ఆర్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'వార్ 2' సినిమా మరో నాలుగు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది ఈ చిత్రం. అయితే సినిమాకు' సర్టిఫికేట్ ఇచ్చే ముందు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ చిత్రయూనిట్‌కి కొన్ని మార్పులను సూచించినట్లు సమాచారం. వాటిలో ముఖ్యంగా, హీరోయిన్ కియారా అద్వానీకి సంబంధించిన బికినీ సన్నివేశంలో 9 సెకన్ల విజువల్స్‌ను తొలగించాలని ఆదేశించినట్లు వార్తలు వస్తున్నాయి. 'ఆవన్ జావన్' అనే పాటలో కనిపించే ఈ బికినీ సీన్‌ను 50 శాతం మేర తొలగించాలని సెన్సార్ బోర్డు కోరినట్లు సమాచారం. దీనికి మేకర్స్ మొదట అంగీకరించకపోగా.. విడుదల తేదీ దగ్గరపడడంతో తగ్గినట్లు తెలుస్తుంది.


## మన్మథుడు అన్షు.. దిమ్మతిరిగే గ్లామర్ ట్రీట్



2002లో నాగార్జున హీరోగా వచ్చిన మన్మథుడు సినిమాతో ఎంట్రీ ఇచ్చి తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న బ్యూటీ అన్షు . అ ఒక్క సినిమాతో అప్పట్లో తన అందంతో యూత్‌ను కట్టి పడేసింది. ఆపై ఒకటి అరా తప్పితే పెద్దగా సినిమాల్లో కనిపించకపోయినా, సినిమాలకు దూరమై పాతికేళ్లైనా నేటికి ఆమెకి మంచి క్రేజ్ లాలనే ఉంటూ వచ్చింది.ఇటీవల మజాకా సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చిన ఈ భామ పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో వరుసగా గ్లామరస్ ఫోటోషూట్స్ ఫొటోలు వదులుతూ సినిమా లవర్స్ ను కలవర పాటుకు గురి చేస్తోంది.ట్రెండీ అవుట్‌ఫిట్స్, ఎలిగెంట్ లుక్స్‌తో పోస్ట్ చేస్తున్న ఫోటోలు నెటిజన్స్‌ను కట్టిపడేస్తున్నాయి. ఒకప్పుడు సిల్వర్ స్క్రీన్‌పై పక్కింటి అమ్మాయిగా మెప్పించిన ఈ బ్యూటీ, ఇప్పుడు సోషల్ మీడియా స్క్రీన్‌పై గ్లామర్ ట్రీట్ ఇస్తోంది.ఆమె తాజా ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌లో వైరల్ అవుతున్నాయి. అందం, ఆకర్షణ, క్లాస్ కాంబినేషన్‌గా కనిపిస్తున్న ఈ ఫోటోలు చూసి అభిమానులు ఖంగు తింటున్నారు.ఈ భామ ఏంటి ఈ స్థాయిలో రచ్చ చేస్తుందని కామెంట్లు చేస్తున్నారు. ఫ్యాషన్ సెన్స్, కంఫిడెంట్ లుక్స్‌తో అన్షు రానున్న రోజుల్లో మరిన్ని సర్‌ప్రైజ్ ఫోటోషూట్స్‌తో ఫ్యాన్స్ ను దిమ్మ తిరిగేలా చేసేలా కనిపిస్తోంది.

## ఇంటిమేట్ సీన్స్ లో అందుకే నటించా..


### క్లారిటీ ఇచ్చిన మిల్కీ బ్యూటీ



ఒకప్పుడు గ్లామర్ క్వీన్‌గా సిల్వర్ స్క్రీన్‌ను రూల్ చేసిన తమన్నా ఇప్పుడు సీనియర్ హీరోల సినిమాల్లోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. అదే సమయంలో వెబ్ సిరీస్‌లు స్పెషల్ సాంగ్‌లతో రచ్చ చేస్తున్నారు.గతంలో లిప్ లాక్‌కు కూడా నో చెప్పిన ఈ బ్యూటీ, తరువాత ఏకంగా ఇంటిమేట్ సీన్స్‌లో కనిపించటంతో ఆడియన్స్ షాక్ అయ్యారు. ఈ సీన్స్ న్యూస్ హెడ్‌లైన్స్‌లో ట్రెండ్ అవ్వటంతో తమన్నా మీద విమర్శలు కూడా గట్టిగానే వినిపించాయి.రీసెంట్‌గా ఇంటిమేట్ సీన్స్ గురించి ఫుల్ క్లారిటీ ఇచ్చారు తమన్నా. బోల్డ్ సీన్స్‌కు నో చెప్పటం వల్ల మంచి సినిమాలు వదులుకోవాల్సి వచ్చిందన్న మిల్కీ, కథ డిమాండ్ చేస్తే కాస్త బోల్డ్‌గా నటించటం తప్పులేదన్న విషయం ఆలస్యంగా అర్థం చేసుకున్నా అన్నారు.అందుకే కొన్ని ప్రాజెక్ట్స్‌తో బోల్డ్‌గా నటించానని క్లారిటీ ఇచ్చారు. అయితే ఈ సీన్స్ చిత్రీకరణ సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారని, పూర్తిగా ఇంటిమసీ కోచ్ పర్యవేక్షణలో కొరియోగ్రాఫ్ చేసి ఆ సీన్స్ చిత్రీకరిస్తారని చెప్పారు.ప్రతీ మూమెంట్ పాట చిత్రీకరించినట్టే కొరియగ్రాఫ్ చేసి షూట్ చేస్తారని క్లారిటీ ఇచ్చారు. భవిష్యత్తులోనూ అలాంటి సీన్స్‌లో నటిస్తా అన్నారు తమన్నా.

## బాక్సాఫీస్‌పై 'మహావతార్ నరసింహ' విధ్వంసం

### 17 రోజుల్లో రూ.175 కోట్లు..




హిందూ మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో యానిమేటెడ్ చిత్రంగా విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించిన చిత్రం 'మహావతార్ నరసింహ' కన్నడ టాప్ బ్యానర్ హొంబలే ఫిల్మ్స్ నుంచి వచ్చిన ఈ చిత్రం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుంది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగులో మంచి కలెక్షన్లు సాధించడమే కాకుండా తాజాగా రూ. 175 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ విషయాన్ని చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. దీంతో యానిమేటేడ్ వెర్షన్‌లో వచ్చి ఇండియన్ సినిమాలలో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా మూవీ రికార్డును నమోదు చేసింది.హొంబలే ఫిల్మ్స్‌తో కలిసి క్లీమ్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం జూలై 25న విడుదలైంది. హిందూ పురాణాల ఆధారంగా రూపొందించిన ఈ యానిమేటెడ్ చిత్రం విష్ణువు దశావతారాల గురించి ఏడు భాగాలుగా రూపొందించే 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో మొదటిది. ఈ సినిమాకు అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించాడు.

## ఒకే చోట మెగా హీరోలు. వైరలవుతున్న ఫొటో

మెగా హీరోలంతా ఒకేచోట కలిశారు. అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ తో పాటు యువ నటులు వరుణ్‌తేజ్ సాయి దుర్గా తేజ్ ముగ్గురు ఒకే చోట కలిసి దిగిన ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జిమ్‌లో వ్యాయామం అనంతరం ముగ్గురు కలిసి దిగిని ఫొటోను వరుణ్ తేజ్ ఇన్‌స్టా వేదికగా పంచుకున్నాడు. ప్రస్తుతం



ఇందుకు సంబంధించిన ఫొటో అంతటా వైరల్‌గా మారింది.సినిమాల విషయానికి వస్తే.. రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది సినిమాలో నటిస్తుండగా.. సాయిధరమ్ తేజ్ సంబరాల ఏటిగట్టు అనే వర్కింగ్ టైటిల్‌తో వస్తున్న చిత్రంలో నటిస్తున్నాడు. వరుణ్ తేజ్ మేర్లపాక గాంధీతో 'కొరియన్ కనకరాజు' అనే కామెడీ చిత్రం చేస్తున్నాడు.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**